KSR02B127 C
ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూన్ 26, 2016

దిల్ గెలిచాడు

ఆటల పాటల హరివిల్లు

'బ్లాక్'లో ఓ దృశ్యం

పింక్, రెడ్, ఆరెంజ్, ఎల్లో, బ్లూ, బ్లాక్ వీటితోపాటు బ్లూ ఆరెంజెస్ ఇవన్నీ రంగుల పేర్లే కాదు సినిమా టైటిల్స్ కూడా. ఇలా చిత్రాలకు రంగుల పేర్లు పెట్టడం ఓ ఫీవర్‌గా మారింది. అమ్మాయిలు ఎక్కువగా ఇష్టపడే రంగు పింక్. తాప్సీ, యాండ్రీనా తరియంగ్, కీర్తి కుల్హారి ప్రముఖ పాత్రల్లో రానున్న చిత్రం పేరు కూడా అదే. అమితాబ్ లాయర్ పాత్రలో కనిపించనున్న పింక్ మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. డౌన్స్ సిండ్రోమ్‌తో బాధపడే ఒక చిన్నారి కథాంశంగా వచ్చిన మరాఠి చిత్రం 'ఎల్లో'. రితేశ్ భార్య, నటి జెనీలియా తెలుగులో రామ్‌చరణ్‌తో కలసి 'ఆరెంజ్' రంగును అద్దుకున్నారు. సంజయ్ దత్, అక్షయ్ కుమార్, లారా దత్తా, కత్రినా కైఫ్ తారాగణంతో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ 'బ్లూ' బాలీవుడ్ భారీ బడ్జెట్ చిత్రాల్లో ఒకటి. సంజయ్ లీలా బన్సాలీ దర్శకత్వంలో 2005లో వచ్చిన చిత్రం 'బ్లాక్'. 'బ్లూ ఆరెంజెస్', 'రెడ్: ది డార్క్ సైడ్' బాక్సాఫీస్ వద్ద తిరగబడ్డ చిత్రాలు. బ్లడ్ బ్యాంకులో రక్తాన్ని అక్రమంగా తరలించే వివిధ మార్గాలని కళ్లకి కట్టినట్టు చూపిన చిత్రం రణ్‌దీప్ హుడా నటించిన 'లాల్ రంగ్'. బుడాపెస్ట్, లండన్‌లోని అందమైన లోకేషన్లలో రూపుదిద్దుకున్న మలయాళీ చిత్రం 'వైట్'.

కలర్ ఫీవర్

'ఆరెంజ్'లో జెనీలియా







'లాల్ రంగ్'

KSR02B127
ENTERED
కథా నిలయం శ్రీకాకుళం

రాణా అయూబ్ తెహల్కా మ్యాగజైన్‌లో జర్నలిస్టుగా పనిచేశారు. తెహల్కా పరిశోధనాత్మక జర్నలిజానికి పెట్టింది పేరు. గుజరాత్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై పరిశోధనాత్మక కథనాన్ని రాసి ఆ రాష్ట్ర హోం మంత్రినే జైలుకు పంపించగలిగిన పాత్రికేయురాలు రాణా. అప్పుడామె వయస్సు 26 ఏళ్ళు. 2002 మారణ హోమం, సొహ్రాబ్దీన్, ఇష్రత్ జహాన్ తదితరుల ఎన్‌కౌంటర్ల బాధ్యులను సాక్ష్యంతో పట్టివ్వాలనేది అమె సంకల్పం.

ధిక్కార స్వరం

మారు వేషంతో వెళ్లి స్టింగ్ ఆపరేషన్ నిర్వహిద్దాం అనుకున్నారు రాణా అయూబ్. తెలిసిన ఒక నటి మేకప్‌మెన్ సహాయం తీసుకొని జులపాల జుట్టును కుదురైన జుట్టుగా మలుచుకుంది. కశ్మీరీ చుడీదార్ వేసుకుని మరి కొన్ని చిన్న చిన్న మార్పులతో రాణా కాస్తా మైథిలి త్యాగి అవతారమెత్తింది. అమెరికాలోని ఫిలిం ఇన్‌స్టిట్యూట్ విద్యార్థిని అని మోదీ ముఖ్యమంత్రిత్వంలో వెలిగిపోతున్న (వైబ్రాంట్ గుజరాత్) గుజరాత్‌పైన డాక్యుమెంటరీ నిర్మించటానికి భారతదేశం వచ్చినట్లు విజిటింగ్ కార్డు, ఫోన్ సిమ్ తదితర సాక్ష్యాలు సంపాదిం చుకుంది. విద్యార్థుల 'ఆదానప్రదాన' కార్యక్రమం కింద భారత్‌కు వచ్చిన మైక్ (పేరుమార్చు) అనే 19 ఏళ్ల ఫ్రెంచి యువకుడ్ని తన అసిస్టెంటుగా నియమించుకుంది. మైక్‌కు మైథిలి ప్రాజెక్టు ఏమిటో తెలీదు. అది 2010-11 మధ్యకాలం. మైథిలి ఆమె అసిస్టెంటు ఇద్దరూ అహ్మదాబాద్ చేరుకున్నారు. నెహ్రూ ఫౌండేషన్‌లో చిన్న గదుల్ని అద్దెకు తీసుకున్నారు. అహ్మదాబాద్ నగరంలో షూటింగ్ నిర్వహిస్తూ క్రమంగా అధికారులు, రాజకీయ నాయకులు తదితరులతో స్నేహం ఏర్పరచుకున్నారు. అమెరికా నుంచి వచ్చిన ఎన్ఆర్ఐ అనేసరికి ఈ పని మరింత సులువైంది.

ఆపరేషన్ ప్రారంభం

రహస్య రికార్డింగ్ పరికరాలను కుర్తా, వాచ్, డైరీ, చెప్పుల్లో అమర్చుకున్నారు. అనేక మంది ముఖ్యులతో 'స్నేహపూర్వక సంభాషణలు' జరిపారు. మొత్తం 8 నెలలపాటు ఈ స్టింగ్ ఆపరేషన్ కొనసాగింది, చివర్లో అనుకోకుండా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఒక అధికారి తీసుకెళ్లారు. మెటల్ డిటెక్టర్ గుండా లోనికి వెళ్తుంటే ఆమె గుండె వేగంగా కొట్టుకుందట. పట్టుబడితే బహుశా ఎన్‌కౌంటర్లో చనిపోయి మృతదేహం కూడా దొరకని కౌసర్ బీ గతే పట్టే దేమో! 2002 గుజరాత్ నరమేధంలో నరేంద్ర మోదీ, అమిత్ షాల ప్రమేయముందని, గెస్ట్ హౌస్‌లో బందీలుగా ఉన్న ఇష్రత్ జహాన్ తదితరులను అప్పటి హోంమంత్రి అమిత్‌షా స్వయంగా ఎన్‌కౌంటర్ చేయించాడని వాటికి సంబంధించిన ముఖ్యమైన సాక్ష్యాల్ని రికార్డు చేశానని చెప్పారు.

తెహల్కా తిరస్కారం

3 నెలలు గడిచాయి. హఠాత్తుగా ఢిల్లీ నుంచి కబురందితే రాణా తెహల్కా ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటి వరకు రికార్డు చేసిన ఆడియో వీడియోలను రాణా ఎడిటర్‌కు చూపించారు. "ఇవన్నీ కాఫీటేబుల్ సంభాషణలు లాగున్నాయని పత్రికలో ప్రచురణకు పనికి రావని, ఇప్పటికే తెహల్కాపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయని ఇలాగైతే పత్రిక మూతబడుతుందనీ..." ఏదేదో చెప్పారు. పరిశోధన ఆపేయమన్నారు. టేపుల్ని ధ్వంసం చేయమని హుకుం జారీచేశారు" అని వాపోయారు రాణా. ఈ టేపుల్ని పరిశీలించి అర్హత ఉంటేనే ప్రసారం చేయమని, ప్రచురించమని ప్రముఖ ఎడిటర్లను రాణా అడిగారు. అన్ని చోట్లా తిరస్కారమే ఎదురైంది. ఈ మధ్యకాలంలో తెహల్కా ఎడిటర్ రేప్ కేసులో చిక్కుకున్నప్పుడు ఆయన తీరుకు నిరసనగా ఆమె తన సంస్థకు రాజీనామా చేశారు. రాణా నాలుగేళ్లలో ఏడు మీడియా సంస్థల్లో ఉద్యోగాలు మారారు. సంభాషణల్ని పుస్తకంగా ప్రచురిద్దామని ప్రయత్నించారు. అయిదుగురు పబ్లిషర్స్ ప్రచురణకు తిరస్కరించారు. ఈ విధంగా అయిదేళ్ల పాటు మానసిక ఒత్తిడి అనుభవించారు. సైకియాట్రిస్ట్ సహాయంతో ఇప్పుడు కోలుకుంటున్నారు. చివరికి 'గుజరాత్ ఫైల్స్ : అనాటమీ ఆఫ్ ఎ కవర్ - అప్' పేరిట గ్రంథాన్ని తీసుకువచ్చారు.

ఆదుకున్న సోషల్ మీడియా

ఢిల్లీలో జరిగిన గుజరాత్ ఫైల్స్ పుస్తకావిష్కరణ సభకు బర్ఖా దత్, రాజ్‌దీప్ సర్దేశాయ్ వంటి ప్రముఖ సంపాదకులు, అరుంధతీ రాయ్ వంటి మేధావులు, అనేక మంది రాజకీయ నాయకులు, జర్నలిస్టులు హాజరయ్యారు. అయితే తెల్లారి ప్రధాన స్రవంతి మీడియాలో వార్తయినా కనిపించలేదు. ఇదే సమయంలో మీడియా మోదీ రెండేళ్ల పాలన విజయాలపై రోజూ అడ్వర్‌టైజ్‌మెంట్లు ప్రసారంచేస్తూ 'పండుగ' చేసుకుంటున్నది! సోషల్‌మీడియా కారణంగా ఈ పుస్తకానికి మంచి ప్రచారం లభించింది. రెండు వారాల్లో దాదాపు 20 వేల కాపీలు అమ్ముడయ్యాయి. దేశంలో ప్రస్తుతం ఇది నెంబర్‌వన్ బెస్ట్ సెల్లర్ అయ్యింది.

'గుజరాత్ ఫైల్స్' పుస్తక పరిచయ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రధాన స్రవంతి మీడియా పోకడలు, రాజకీయ నాయకులు, వ్యవస్థల తీరుతెన్నులపై ఎంతో ఉద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. "జర్నలిజంలో డిగ్రీ చదివేటప్పుడు మాకు నైతిక విలువలు పాటించాలని, సత్యనిష్ఠ ఉండాలని, సామాజిక న్యాయానికి కట్టుబడాలని నేర్పారు. ఇప్పుడు నా పరిశోధనను ఎందుకు ప్రచురించటం లేదు? పాత్రికేయులు గిన్నిపిగ్స్ అనుకొంటున్నారా" అంటూ పెట్టుబడిదారీ మీడియా యాజమాన్యాల్ని ఆమె సూటిగా ప్రశ్నించారు. అధికార కేంద్రాలను ప్రశ్నించే పరిశోధనాత్మక కథనాలను చంపేస్తారా అని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవస్థ లోపాలను ఎత్తిచూపడానికి, పాత్రికేయ విలువలు కాపాడటానికి యుద్ధం చేయాల్సిందేనని" ప్రసంగించారు. మీడియాలోనే రెబెల్ రాణాకు జేజేలు.. మన దేశానికి ఇలాంటి నిబద్ధత కలిగిన వేలాదిమంది పాత్రికేయులు, మేధావుల అవసరం ఎంతయినా ఉంది.

- బి. భాస్కర్
9989692001

ఇండెక్స్

ప్రత్యేకం................3
కోకో మాట

విజేత.............. 4
జాజి పూవు

కార్టూన్ పంచ్......... 5

వింతలోకం...................10
కోతుల రాజ్యం

వినూత్నం..............11
పంటకు సోలార్ రక్షణ

కొత్త పుస్తకాలు................14
యువతకు కొత్త కానుక

ఆటల పాటల హరివిల్లు



అట్టమీది కథ...6

నా కళ్లతో - 12
ఆరు ఖండాలు... అరవై పెళ్లిళ్ళు

వివరం................15
ప్రాణం తీసేంత అభిమానం!

స్టార్ 16
దిల్ గెలిచాడు

కథ................18
ప్రయాణం / రాజధాని

రుచి....................21
జొన్న లడ్డు

బాల నేస్తాలు.............23
తొమ్మిదేళ్ళ యాబ్‌స్ట్రాక్ పెయింటర్

పద వికాసం.....
....24

వివక్షపై పిడిగుద్దు

గొప్ప బాక్సర్ గానే కాకుండా జాతి వివక్షపై పోరాడిన యోధుడు అలీ. బాక్సింగ్‌లో పతకాలతో పాటు నిజజీవితంలోనూ పోరాటాల్లో ధీటైన ప్రతిభ కనబరిచిన ఆలీ గురించి అందించిన విశేషాలు ఆకట్టుకున్నాయి. ఇజ్రాయిల్ మూకల దౌర్జన్య కాండకు రగిలిపోతూ నిరంతరం ఆ పూటేజీలని అందరి దృష్టికీ తీసుకొస్తున్న తొమ్మిదేళ్ళ జెన్నా నిజమైన సాహసి. పెళ్లి కానుకగా అందరిచేతా మొక్కలు నాటించిన ప్రియాంకలా నేటితరం ఆలోచించాలి. నీరు లేని లాతూర్ గ్రామంలో డబ్బులు ఆశించకుండా మోసా అందరికీ నీరందించడం గర్వకారణం. నలభై ఏళ్ల వయసులో గుజరాత్ బీచ్‌ని శుభ్రపరుస్తున్న కాలు దంగార్ యువతకు ఆదర్శనీయం.

- టి. సత్యనారాయణమూర్తి,
విశాఖపట్నం

రోబో లాయర్

మానవ మేధస్సుతో రూపుదిద్దుకున్న రోబో లాయర్లు తిరిగి వారికి ఉపయోగపడటం గర్వకారణం. సమయం, డబ్బు వృథా అవకుండా ఉండేందుకు ఇలాంటి రోబోల సాయం ముందుతరాలకు మరింతగా



అవసరమవనుంది. బీచ్‌లో పేరుకుపోతున్న చెత్త తొలగించేందుకు కాలూ దంగార్ చేస్తున్న కృషి అభినందనీయం. ఊరిలో నీటి కష్టాన్ని తీరుస్తున్న మోసా, ప్రఖ్యాత బాక్సర్ అలీ పై అట్టమీది కథ ఆకట్టుకున్నాయి. క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వస్తే ఏంచేయాలో తెలీని వారు చాలా మంది. అలాంటి వారికి ఇమ్రాన్ రాసిన పుస్తకం 'కిస్ ఆఫ్ లైఫ్' ధైర్యాన్ని చేకూరుస్తుంది. మూడు నెలల వయసులో గాయాలతో కనిపించిన ఎలుగుబంటిని ఆదరించిన మాస్కో దంపతులకి చిన్న చిన్న పనుల్లో సాయమందించడంతోపాటు టీవీ షోలూ, ఫోటోషూట్లలో దూసుకుపోవడం, అంతరించి పోతున్న పక్షి జాతుల్లో చేరిన కొకాపో ఆశ్చర్యానికి గురిచేశాయి.

- ఎమ్.ప్రవీణ, ఒంగోలు

తొమ్మిదేళ్ల సాహసి

పాలస్తీనా ప్రాంతంతో నిత్యం జరుగుతున్న మారణ హోమాల్ని, సైన్యం అండదండలతో గ్రెనేడ్ దాడులు నిర్వహిస్తున్న ముష్కర మూకల అరాచకాల్ని ప్రపంచానికి తెలిసేట్టు చేస్తున్న తొమ్మిదేళ్ల జెన్నా నిజంగా సాహసే. బైక్ రైడ్‌లపై యువతకు అవగాహన కలిగించేందుకు తారలు ముందుకు రావడం మంచి పరిణామం. పెళ్లికానుకగా ప్రియాంక భధోరియా పదివేల మొక్కలు నాటించడం అభినందనీయం. వివక్షపై పిడిగుద్దు, లెక్కల మాస్టారి నీటి లెక్కలు, రోబో లాయర్, చిట్టి చేతులకు శిక్షొద్దు,

- ముకుందరావు, గుంటూరు

పదివేల చెట్లు

పెళ్లి కానుకగా పది వేల చెట్లు శీర్షికన వచ్చిన వ్యాసాన్ని చదివి అబ్బురపడ్డాను. పదివేల చెట్లు నాటాలనే తన కోరికకు తల్లి దండ్రులు అడ్డు చెప్పకుండా ఆమెకు నచ్చినట్టే ప్రవర్తించడం హర్షించదగ్గ విషయం. అలాంటి విశాల భావాలను అందరూ ఆచరించాలి. వృక్ష సంపదను అభివృద్ధి పరచవలసిన బాధ్యత ప్రజలపైన, ప్రభుత్వాలపైనా ఉన్నది.

- కై.పు నాగరాజు
అనంతపురం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

కోకో అనే గొరిల్లా సైగల భాష నేర్చుకుని చక్కగా మనుషులతో మాట్లాడేస్తోంది. మాటల వరకే ఆగిపోలేదు మనిషి అలవాట్లన్నీ నేర్చేసుకుంది. ఇది జంతు భాషా పరిణామంలో ఓ అద్భుతం. పరిశోధకులను ఆశ్చర్యపరుస్తోన్న కోకో గురించి కొన్ని వివరాలు..

కోకో మాట

1971 జులై 4న శాన్ ఫ్రాన్సిస్కోలో పుట్టిన కోకో చిన్నప్పుడే తల్లి నుంచి వేరు చేయబడింది. అప్పుడు పెన్నీ పాటర్‌సన్ సైకాలజీలో పి.హెచ్.డి చేస్తోంది. సైగల భాషలో ఏప్‌ల సామర్థ్యం ఆమె పరిశోధనాంశం. మొదటిసారి కోకోను జూలోనే కలిసింది. కోకోకు ఏడాది వయసున్నపుడే పరిశోధన కోసం గొరిల్లా ఫౌండేషన్ అనుమతితో తెచ్చుకుంది. ఇప్పటికీ అది ఆమె వద్దే ఉంటోంది. కోకోకు అమెరికన్ సైగల భాష నేర్పింది. ఈట్, డ్రింక్, మోర్ వంటి చిన్న పదాలతో శిక్షణ మొదలైతే ప్రస్తుతం కోకో 1000 పదాల వరకు సైగల ద్వారా చెప్పే స్థాయికి చేరుకుంది. స్పోకెన్ ఇంగ్లీషుకు సంబంధించి 2000 దాకా పదాలను అర్థం చేసుకోగలదు. సంజ్ఞలను కలిపి కొత్తవి కూడా అడగగలదు. కోకో ఎదుగుతున్న బిడ్డ వంటిది అని చెప్తున్న పెన్నీ.. కోకోల మధ్య తల్లీ బిడ్డల బంధం బలపడింది. ఇప్పుడు పాటర్‌సన్‌కు 70 యేళ్లు. కోకోకు 45 ఏళ్లు. ఇప్పటికీ పాటర్‌సన్ రోజులో ఎక్కువ భాగం కోకోతోనే గడుపుతారు. ఎక్కడికైనా అత్యవసరంగా వెళ్లవలసి వచ్చినా కోకోను లైవ్ కెమెరాతో శ్రద్ధగా గమనిస్తుంటారు. వీరి బంధంపై న్యూ బిబిసి వారు డాక్యుమెంటరీ కూడా తయారు చేశారు.

మనిషినా..

కోకో అలవాట్లు, హావాభావాలు గమనిస్తే అవి మనుషులకు ఎంత దగ్గరగా ఉంటాయంటే ఒక జంతువుతో మాట్లాడుతున్నామన్న అనుభూతే మనకు కలగదు. కోకో తన అస్తిత్వం విషయమై గందరగోళ స్థితిలో ఉంది. కోకో తాను ఓ గొరిల్లాను అనుకోవటం లేదు. పెన్నీయే తన తల్లి అనుకుంటోంది. తాను గొరిల్లా జాతికి చెందినది కాదని మానవ సంతతికి చెందినదని అనుకుంటోంది. కోకో మనుషుల పట్ల లైంగిక ఆకర్షణ కూడా చూపిస్తోంది. డాక్యుమెంటరీ నిర్మాణంలో కెమెరామెన్‌గా ఓ ఆకర్షణీయమైన పురుషుడిని నియమించమని నిర్మాత ఆపిల్‌బైకి పెన్నీ సలహా కూడా ఇచ్చింది. ప్రఖ్యాత గాయకుడు బెనడిక్ట్ కంబర్‌బాచ్ డీవీడీలను చూసి అతని స్వరానికి అభిమాని అయిపోయింది. కోకో మైఖేల్ అనే మరో మగ గొరిల్లాతో కలిసి ఉండేది. ఆ గొరిల్లా కూడా సైన్ లాంగ్వేజ్ నేర్చుకుంది. 2000లో మైఖేల్ చనిపోయింది. ఇప్పుడు న్డ్యూమ్ అనే వేరొక మగ గొరిల్లాతో కలిసి ఉంటోంది కోకో.

తన నుంచి బిడ్డను వేరు చేసిన ఒక రోజు తర్వాత కూడా బేబీ సంజ్ఞను చేసి చూపటం, 19 ఏళ్ల వయసులో 'మిర్రర్ టెస్ట్'లో అద్దంలో తనను

తాను గుర్తించగలడం పరిశోధకులకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. తన వ్యక్తిగతమైన పాత విషయాలను కూడా కోకో చెప్తుంది. విందు కావలసి వస్తే రాస్ప్‌బెర్రీలను విసరటం, ముక్కు చీదే ముందు టిష్యూ అడ్డుపెట్టుకోవటం, వాద్యాలను వాయించటం కళ్లజోడు పెట్టుకునే ముందు నోటితో వూది గుడ్డతో శుభ్రం చేయటం, ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు అభినయించడం వంటివి చేస్తున్న కోకో నిజంగా మనిషే అనిపిస్తోంది కదా.

పిల్లుల్ని ముద్దు చేస్తోంది

పెంపుడు జంతువులను పెంచుకునే జంతువులలో కోకో ఒకటి. 1983లో క్రిస్మస్ కానుకగా కోకో ఒక పిల్లిని అడిగింది. గొరిల్లా ఫౌండేషన్‌కు చెందిన రాన్‌కాన్ అనే జీవశాస్త్రజ్ఞుడు ప్రాణమున్నట్లుగా అనిపించే ఒక జంతువు బొమ్మను ఇస్తే కోకో అంతగా సంతృప్తి చెందలేదు. దానితో అస్సలు ఆడుకోలేదు. శాడ్ అనే సంజ్ఞను పదేపదే చూపి తన అయిష్టాన్ని ప్రకటించింది. 1984లో కోకో పుట్టిన రోజున పిల్లి పిల్లలను దాని ముందు ఉంచితే వాటిలో నుంచి బూడిద రంగులోనున్న ఒక మగ పిల్లి పిల్లను ఎంపిక చేసుకొని దానిపేరు 'ఆల్ బాల్' అని పేరు పెట్టింది. ఆల్ బాల్‌ను సరిగ్గా బేబీ గొరిల్లాను సంరక్షించినట్లే సంరక్షించింది. అదే సంవత్సరం డిసెంబర్‌లో కోకో బోను నుంచి ఆల్‌బాల్ బయటకు వెళ్లడంతో కారు కింద పడి చనిపోయింది. తర్వాత అదే విషయాన్ని పాటర్‌సన్ సంజ్ఞల ద్వారా కోకోకు చెప్తే కోకో విషాదానికి సంబంధించిన పదాలతో బదులిచ్చింది.

1985లో మళ్లీ ఎంచుకునే అవకాశం ఇస్తే కోకో రెండు పిల్లి పిల్లలను ఎంపిక చేసుకుంది. వాటికి కూడా తానే 'లిప్ స్టిక్', 'స్మోకీ' అనే పేర్లు పెట్టింది. అవి కూడా మగవే. మొదట నారింజ రంగులో పిల్లి పిల్లను ఎంచుకొని 'లిప్‌స్టిక్' అని పేరు పెట్టింది. ఆ పేరుకు అర్థం ఏమిటనే ట్రైనర్ అడిగితే లిప్స్ లిప్‌స్టిక్ అని బదులిచ్చింది. ఆల్ బాల్‌లా గ్రే గుర్తులు కాకుండా ఆ నారింజ రంగు పిల్లికి గులాబీ రంగు మూతి ఉన్నట్లు గమనించే వరకు పాటర్‌సన్‌కు అసలు విషయం అర్థం కాలేదు. రెండవ పిల్లి గొరిల్లా బుక్‌లో పిల్లిలా ఉండటంతో స్మోకీ అనే నామకరణం చేసింది కోకో. అక్టోబర్ 2015లో మరో రెండు పిల్లి పిల్లలను కోకోకు బహుకరిస్తే వాటికి మిస్‌బ్లాక్, మిస్ గ్రే అని పేర్లు పెట్టింది. వాటిని తాను దత్తత తీసుకున్నానని ట్రైయినర్స్‌కు చెప్పింది.

- సింహాద్రి నాగ శిరీష





జాజి పూవు

జాజి పూవు స్ప్రింట్ చేస్తోంది. నేలను తాకనట్టు ట్రాక్‌లో దూసుకుపోతోంది. గాలిలో తేలుతూ సింక్రనైజ్ స్ప్రింట్‌లా ప్రత్యేకంగా కనిపించే 400 మీటర్ల విభాగంలోని అందాన్ని మరింత పెంచేస్తోంది. ఆ జాజి పూవు మరెవరో కాదు ఆ పోటీల్లో ఆసియా నెం.2 స్ప్రింటర్ మన భారతీయురాలు పూవమ్మే. పాతికేళ్ల వయసులోనే అర్జున అవార్డు దక్కించుకున్న ఈ యువ క్రీడాకారిణి రాబోతున్న రియో ఒలంపిక్స్‌కి సన్నద్ధమవుతోంది. తల్లి జాజి చేయి పట్టుకుని పరుగు పందెం ట్రాక్ ఎక్కిన పూవమ్మ తాను ఇప్పటికీ తల్లి చాటు బిడ్డనే అంటోంది.. అంటే జాజి పూవమ్మే కదా.

మచెట్టిర రాజు పూవమ్మ 1990 జూన్ 5న కర్నాటకలోని కూర్గ్ ప్రాంతంలోని గోనికొప్పల్ నగరంలో జన్మించింది. ఎం.జి రాజు, జాజి అమె తల్లిదండ్రులు. డిగ్రీ వరకు చదువంతా మంగళూర్‌లోనే కొనసాగింది. ప్రముఖ బీపీఒ సంస్థ ఇంటెల్ నెట్ సిఇఒ సుశీల్ కుమార్, కన్నడ ప్రముఖ హీరో అర్జున్ చదివిన ఎస్‌డిఎమ్ విశ్వవిద్యాలయంలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తి చేసింది. అథ్లెటిక్స్‌లో ప్రపంచ స్టార్‌గా పూవమ్మ ఎదగడానికి కారణం ఆమె తల్లే. బుడి బుడి అడుగుల్ని తండ్రి వేయించుంటాడేమో గానీ పూవమ్మ పరుగును ట్రాక్ పట్టించింది తల్లే. కొంటె పనులు చేసి మిత్రుల కన్నా వేగంగా పరుగెడుతూ తప్పించుకునే కూతుర్ని చూసి మురిసిపోవడంతోనే ఆమె తృప్తి చెందలేదు. ఆ చిట్టి పాదాలు రన్నింగ్‌ను కెరీర్‌గా తీసుకుంటే ఎంత దూరాలకు పరుగెడతాయో పసిగట్టింది. 2003లో పూవమ్మకు 14 ఏళ్లున్నపుడు ఆమె తల్లి జాజి స్థానికంగా జరుగుతున్న ఓ అథ్లెటిక్స్ మీట్‌కు తీసుకెళ్లింది. పూవమ్మ అంత ఆసక్తి చూపించకున్నా ముద్దు చేస్తూ కవ్విస్తూ వేదికకు తీసుకెళ్లింది. అంతమంది జనాల మధ్య అరుపులు, చప్పట్ల మధ్య చిరుతలా పరుగు తీస్తుండటంలో ఏదో కిక్కుందనే విషయం అప్పటికి గానీ పూవమ్మకు తెలీలేదు. తల్లి జాజి ప్రోత్సాహాన్నిచ్చి పూవమ్మకు రన్నింగ్‌ను కెరీర్‌గా మార్చేసింది. బెరుకు, భయం వంటి తొలి అడ్డంకుల్ని దాటించి తొలి రేసు విజయవంతంగా చేధించేలా చేసింది. గెలుపోటములతో సంబంధం లేకుండా కూతురు పరుగు పందేన్ని ఆస్వాదించడమే ముఖ్యమన్నట్టు జాజి పూవమ్మ పాదాలకు మురిపెంగా షూలను తొడిగింది. అలా పాఠశాల స్థాయి పరుగు పందేలు దాటి కళాశాల పరుగు పోటీల్లోను దూసుకుపోయింది. పూవమ్మ చిరుత పరుగు గురించి కోచ్‌లు క్రీడా శాఖ చెవిన వేయడంతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం దక్కింది. అక్కడ ట్రాక్‌లో దూసుకుపోవడంతో వెంటనే ఆమెకు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం కలిగింది. దేశంలో జరిగిన ప్రతి పోటీలోను పూవమ్మ వెంట జాజి తోడుగా వెళ్లేది. ఒక్క పోటీని కూడా విడిచిపెట్టకుండా పూవమ్మకు ప్రోత్సాహాన్నిచ్చేది. 2006లో బీజింగ్‌లో జరిగిన ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో 56.39 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని 7వ స్థానంలో నిలిచింది. తొలి అంతర్జాతీయ పోటీల్లోనే ప్రతిభ కనబర్చింది. 2007లో జరిగిన ప్రపంచ యూత్ ఛాంపిన్‌షిప్‌లో, పోలాండ్‌లో జరిగిన ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచింది. 2008లో పూణెలో నిర్వహించిన కామన్‌వెల్త్ యూత్ గేమ్స్‌లో 400 మీటర్ల సింగిల్స్ విభాగంలో 55.17 సెకన్ల సమయంలో టార్గెట్‌ని పూర్తిచేసి రెండో స్థానంలో నిలిచి రజతాన్ని గెలుచుకుంది. 4*400 మీటర్ల రిలే విభాగంలో బంగారు పతకాన్నందించింది. పూవమ్మ కెరీర్‌ను 2008లో బీజింగ్‌లో జరిగిన ఒలంపిక్స్ మలుపు తిప్పాయి.

భారత్‌కి చెందిన అతి ప్రతిభావంతురాలయిన అథ్లెట్‌గా ఆమె పేరు తెచ్చుకుంది. కానీ, డిస్క్ సమస్య కారణంగా 2009లో ట్రాక్‌లో కనిపించకుండా పోయింది. ఇక క్రీడలకి పూవమ్మ పూర్తిగా దూరమైందని కథనాలు వచ్చాయి. ఫిజియోథెరపిస్ట్ (ప్రముఖ బాక్సర్) హరి శంకర్ వర్మ వైద్యం, తల్లిదండ్రులు అందించిన ఆత్మస్థైర్యంతో కోలుకున్న పూవమ్మ 2011 చివరి నాటికి తిరిగి పూర్తి ఫామ్‌లోకొచ్చింది. 2011 సెప్టెంబర్‌లో కోల్‌కతాలో జరిగిన ఓపెన్ నేషనల్స్‌లో పాల్గొని మొదటి స్థానాన్ని దక్కించుకుంది. 2012లో బ్యాంకాక్‌లో జరిగిన మూడు వరుస ఏషియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలతో పాటు ఒక రజతాన్ని గెలుచుకుంది. తర్వాతి ఏడాది బ్యాంకాక్‌లో జరిగిన 'ఏషియన్ గ్రాండ్ ప్రిక్స్'లో బంగారు పతకంతో పాటు అదే సంవత్సరం భారత్‌లోని పాటియాలాలో జరిగిన ఫెడరేషన్ కప్ పోటీల్లో 52.75 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని ఫాస్టెస్ట్ రన్నర్ అనిపించుకుంది. 2013లో మాస్కోలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్, మహిళల 4లి400 మీటర్ల రిలేలో దూసుకుపోయింది. 2014 దక్షిణ కొరియాలోని ఇంచియాన్ 'ఏషియన్ గేమ్స్' మహిళల 4*400 రిలేలో విభాగంలో టింటు లూకా, మన్‌దీప్ కౌర్, ప్రియాంక పవార్‌లతోపాటు పూవమ్మ జట్టు 3:28:68 సెకన్లలో పూర్తిచేసిన పరుగు పూర్తిచేసిన ఈ బృందం పాత రికార్డులని బద్దలు కొట్టి అథ్లెటిక్స్‌లో కాంస్య పతకంతో భారత్‌కి నాలుగోసారి వరుస విజయాన్ని అందించింది.

2015లో అర్జున అవార్డుతో పాటు యేషిన్ గేమ్స్‌లో బంగారు పతకాల్ని అందుకున్న పూవమ్మ ఎన్ఐఎస్(నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ స్పోర్ట్స్)లో రియో ఒలంపిక్స్ కోసం ట్రెయినింగ్ తీసుకుంటున్నారు. 2013 లక్నోలో జరిగిన అంతరాష్ట్ర పోటీల్లోని 400 మీటర్ల స్ప్రింట్‌లో తన అత్యుత్తమ టైమింగ్ 51.73 సెకన్లతో రికార్డు సృష్టించినపుడు ఆమె కాళ్లు విపరీతమైన నొప్పి పుట్టాయని, ఊపిరి తీసుకోడానికి కష్టమైందని ఆ సమయంలో తల్లిని జ్ఞప్తికి తెచ్చుకున్నానని పూవమ్మ ఉద్వేగాన్ని పంచుకుంది. ✦



నవ్వుల్ – పువ్వుల్



ఎక్కడో చూశా !

ఓ యువకుడు బస్టాపులో నుంచున్న యువతిని ఎలాగైన మెప్పించాలని పోజులు కొడుతున్నాడు.

"మిమ్మల్ని చూస్తుంటే ఎక్కడో ఎప్పుడో చూసినట్టు, మీరు నాకు బాగా తెలిసినట్టు అనిపిస్తోంది"

"అయ్యుండచ్చు. నేను పిచ్చాసుపత్రిలో నర్సుని...

పిల్లలు



పందికి మాత్రమే ఉండి మిగతా జీవులకు లేనిదేమిటి చెప్పండ్రా.. అడిగాడు మాష్టారు.

పంది పిల్లలు సార్....! చెప్పాడో విద్యార్థి

వంద నోటు మింగేశాడు

నిన్న మా పాప పావలా నాణెం మింగేసింది..!!

"అలాగా..... మరి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లావా..?"

"ఆ.. తీసుకెళ్లా... ఆయనో వంద నోటు మింగేశాడు..."

హెడ్ టు షోల్డర్స్

ఒక రోజున జంభులింగం తలస్నానం చేస్తూ షాంపూను తలతో పాటు భుజాలకు కూడా రాసుకున్నాడు.

భార్య : ఏమండీ షాంపూలను తలకే రాస్కోవాలి ఒంటికి కాదు"

జంభులింగం: తింగరిదానా ఇది ఏమైనా మామూలు షాంపూ అనుకున్నావా, ఇది హెడ్ టు హోల్డర్స్

చిల్లర

బస్సు కండక్టరుకు చిర్రొత్తుకొచ్చేదెప్పుడు?

బస్సు నదిలో పడిపోయినా... ప్రయాణీకుడు ఈదుకుంటూ వచ్చి చిల్లర అడిగినప్పుడు.

అన్యాయం

ఇది మరీ అన్యాయం. రేపట్నుంచి నేను స్కూలుకు వెళ్లనుగాక వెళ్ళను. అన్నాడు ఆరేళ్ళ ప్రమోద్.

అంత అన్యాయం ఏం జరిగిందిరా? నవ్వుతూ అడిగాడు తండ్రి.

లేకపోతే మా టీచరేమో పుస్తకం చూస్తూ పాఠం చెబుతుంది. మమ్మల్ని మాత్రం చూడకుండా పాఠం అప్పజెప్పమంటుంది, తప్పు కాదూ...... అన్నాడు ప్రమోద్.



తెలివి తేటలు

"రాధా రాధా".. మన బుజ్జిపండు మాటలు విన్నావా? చూడు రెండెళ్ళకే ఎంత చక్కగా మాట్లాడుతున్నాడో! నా తెలివి తేటలు అన్ని వీడికి వచ్చాయి సంతోషంగా అన్నాడు రమేష్.

అవును నిజమే నా తెలివి తేటలన్నీ నా దగ్గరే ఉన్నాయి అన్నాయి. రాధ

కేసు



లాయర్: మంటల్లో తగలబడుతున్న భవనం నుంచి ఆరుగురిని బయటకు లాక్కొచ్చినా కూడా నిన్ను అరెస్ట్ చేశారా ఎందుకు?

దోషి: ఎందుకంటే..? నేను లాక్కొచ్చిన వాళ్లంతా అగ్నిమాపక సిబ్బంది మరి...

ఇంకా రాలేదా?

నెల రోజుల నుంచి ఏబిసిడిలు దిద్దుతున్నావ్....ఇంకా రాలేదా? కోపంగా అడిగింది టీచర్.

ఏబిసిడీలు ఎప్పుడో వచ్చేశాయండి. కానీ ఇ దగ్గర నుండే రావటం లేదు అన్నాడు స్టూడెంట్ బాధగా

అట్టమీది కథ

ఆటల పాటల హరివిల్లు

సత్యాజీ
- 9490099167

మాక్కొక ఆటస్థలం కావాలి!
"పక్షుల్లా రెక్కలు అల్లార్చి
ఆకాశంలో ఎగరాలని ఉంది..
జింకపిల్లలా లంఘించి
పచ్చిక బయళ్ల నిండా తిరగాలని
ఉంది..
సీతాకోక చిలుకలా రంగులు
పులుముకొని
ఇంద్ర ధనుస్సును తాకాలని
ఉంది..
జలపాతంలా ఉరకలెత్తి
కొండ శిఖరం మీంచి
దుముకాలని ఉంది..
పిల్ల కాలువలా పరుగులెత్తి
పంట చేలల్లో ప్రవహించాలని
ఉంది..
పంజరం లాంటి ఈ నాలుగ్గోడల
మధ్యా
ఉండాలని లేదు ...
అసలు ఉండాలని లేదు ...!"

ఆరో తరగతి చదువుతున్న ఓ చిన్నారి 'ఆశ' అనే శీర్షికతో రాసిన చిన్ని కవిత ఇది. పిల్లల ఆశలకు, ఆలోచనా తీరుకూ అద్దం పట్టే అక్షర మాలిక ఇది. పిల్లలు ఇంతే! ప్రపంచంలోని ఎక్కడి పిల్లలైనా ఇంతే! ఆడుకోవాలనుకుంటారు. పాడుకోవాలనుకుంటారు. ఆడి, పాడి, అలసి హాయిగా నిదురపోవాలి అనుకుంటారు. ఆటల పాటల మధ్యే ఆనందంగా చదూకోవాలి, నేర్చుకోవాలి అనుకుంటారు. ఎందుకంటే- వాళ్లు ఇంకా ప్రకృతి నుంచి ప్రేరణ పొందే సహజ లక్షణం నుంచి విడివడిపోరు. లాభనష్టాల తక్కెడతో జీవితాన్ని తూచుకోరు. ఆడడం, ఆనందం తప్ప మరో ధ్యాస ఉండదు వారికి. అందుకనే వారికి - చెట్టు కొమ్మల మీద గెంతే ఉడుత ఉత్సాహాన్నిస్తోంది. గుబురు కొమ్మల్లో దాక్కొని పాడే కోయిల ఉత్తేజాన్నిస్తోంది. పారే ఏరూ, పరుగులెత్తే బుజ్జి కుక్క, విరిసే పువ్వూ, కురిసే వానా... ఇలా అన్నీ సంతోష కారకాలే అవుతాయి. అచ్చం అలాగే తాము కూడా ప్రవహించాలని, పరవశించాలనీ అనుకుంటారు.

పిల్లలు అడగరు..

అడక్కుండానే స్కూల్లో చేర్పిస్తాం. పుస్తకాలు, బ్యాగు, పెన్నులు, పెన్సిళ్లూ ... అన్నీ కొంటాం. యూనిఫాం, షూస్, బెల్టు, టై ... అన్నీ సమకూరుస్తాం. ఇంకేం కావాలో చెప్పి చెప్పి మరీ కొనిపిస్తారు స్కూలు వాళ్లు.

పిల్లలకు ఇవేనా? ఇంకేమీ వద్దా? కావాలి.పిల్లలకు ఆటలు కావాలి. ఆడుకోవటానికి ఒక ఆటస్థలం కావాలి. చదువుతూ చదువుతూనే ఆడుకోవాలి. ఆటలు పిల్లల ప్రాథమిక హక్కు. ఆటస్థలం ఒక్కటే ఆ ఆశలు నెరవేర్చే దిక్కు..









కానీ, అలా లేదు ...!

దాదాపు పన్నెండేళ్ల పాటు సాగే పాఠశాల విద్య పిల్లల జీవితంలో చాలా కీలకం. వ్యక్తిత్వ వికాసానికి పునాది వేసే దశ ఇది. అపురూపంగా భావించే బాల్య, కౌమార దశలు ఇక్కడే నడుస్తాయి. మరి అలాంటి ముఖ్యమైన తరుణంలో పిల్లల వికాసానికి వీలు కల్పించేలా మన విద్యావిధానం ఉందా? అన్నది ప్రశ్న. చదువుకు, మార్కులకు ఇస్తున్న ప్రాధాన్యం ఆట పాటలకు ఇస్తున్నామా? అన్నది పరిశీలించాల్సిన అంశం. అసలు పిల్లలకు ఏ పద్ధతిలో చదువు నేర్పాలి? అన్నది పెద్ద చర్చ. ఈ ప్రశ్నలూ, పరిశీలనలూ, చర్చలూ ఇలా ఉండగానే- మన దేశంలో విద్యావిధానం పెనంలోంచి పొయ్యిలో పడింది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్య – వికాసం రెంటి మధ్యా సమన్వయం, సంతులనం సాధించే శాస్త్రీయ ఆలోచనలు సాకారం దాల్చనే లేదు. ఈలోగానే ప్రయివేటు, కార్పొరేటు విద్యావిధానం విస్తరించుకుపోయింది. 'ఎక్కువ మార్కులు, ర్యాంకులు' మాత్రమే ధ్యేయంగా చదువు కుంచించుకుపోయింది. ఈ దృక్పథం కారణంగా సహజంగానే ఆటపాటలు అటకెక్కాయి. ఆగస్టు 15కో, స్కూలు డే ఫంక్షన్లకో పరిమితం అయ్యాయి.

ఆటలు ఎందుకు అవసరం?

ఉద్యోగం, సంపాదన, బాగా బతకడం అనే దానికన్నా – ఆడడం, పాడటం అనేది జీవి సహజమైన, ప్రాథమికమైన స్వభావం. ఇది మానసిక, శారీరక ఆనందాన్నిచ్చే ప్రకృతిసిద్ధ వ్యాపకం. పిల్లలు ఈ సహజ స్వభావానికి దగ్గరగా ఉంటారు. కాబట్టి– ఆటల పట్ల అమితాసక్తి చూపిస్తారు. ఆటల వల్ల ఆరోగ్యం, ఆనందం రెండూ ఒనకూడతాయి. వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన తొలి పాఠాలు ఆటల మైదానంలోనే పరిచయం అవుతాయి. అభిరుచులకు తగ్గ స్నేహాలు అక్కడే మొగ్గ తొడుగుతాయి. ఆరో తరగతి అబ్దుల్లాకు, ఏడో తరగతి ఏకాంబర శర్మకు ఆటస్థలంలోనే చెలిమి కుదురుతుంది. కబడ్డీలో గాయపడ్డ కరణ్‌సింగ్‌కు సపర్యలు చేసే సావకాశం అక్కడే సాధ్యమవుతుంది. ఉరికురికి వస్తున్న వాలీబాల్‌ను ఎప్పుడు ఎత్తి కొట్టాలో, ఎప్పుడు దించి నొక్కాలో ఒక వ్యూహం. బరిలో ఒంటరిగా ఉన్నప్పుడు ఎలా ఉండాలో, జట్టుగా ఉన్నప్పుడు ఎలా వ్యవహరించాలో కబడ్డీ ఒక కర్తవ్య బోధ. తోటివారిని అందుకోవడం, అందించటం ఖోఖోలో ఒక అప్రమత్త విద్య. ... ఇలా ఆట ఏదైనా పాఠం ఒకటి ఉంటుంది. ప్రతిభా పాటవం పెంపొందేలా చేస్తుంది. సమన్వయం, సహకారం, సమిష్టితత్వం, ఆచితూచి వ్యవహరించటం, అప్రమత్తంగా ఉండడం, అంచనా వేయడం ... ఇలాంటి జీవన నైపుణ్యాలు మైదానంలోనే అలవడతాయి. బలపడతాయి. శారీరక ఆరోగ్యానికే కాదు; మానసిక వికాసానికి కూడా ఆటలూ, ఆట స్థలాలూ దోహదం చేస్తాయి.

ఆచరణలో ఆటల్లేవు!

ఆటలూ పాటల మధ్య చదువు ఉండాలి అనేది అందరూ అంగీకరించే మాట. కానీ, ఆచరణలోనే అది కనపడడం లేదు. పిల్లలు ఆడుకోవాలి అంటే – పాఠశాలల్లో కచ్చితంగా ఆట స్థలం ఉండాలి. ఆడుకోవటానికి సమయం ఉండాలి. ఆడించే ఉపాధ్యాయులు ఉండాలి. ఆట ఒక తప్పనిసరి అవసరం అనే భావన పాఠశాల యాజమాన్యంలో ఉండాలి. కానీ, అలా ఉండడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో తగినంతమంది వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. పదింట ఒక పాఠశాలకు మాత్రమే వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 48 శాతం వాటికి మాత్రమే ఆట స్థలాలు ఉన్నాయి. ఉన్నచోట

ఆటల విధానం ఉండాలి ...

- ప్రభుత్వానికి ఆటలపై ఒక స్పష్టమైన, కచ్చితమైన విధానం ఉండాలి.
- ప్రతి విద్యాసంస్థకూ ఆటస్థలం ఉండడం తప్పనిసరి చేయాలి. ప్రతిరోజూ ఆటల పీరియడ్ అమలయ్యేలా చూడాలి. ఆటస్థలాలు లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి.
- ఆటల్లో రాణించే విద్యార్థులకు, స్కూళ్లకు ప్రత్యేక గుర్తింపునివ్వాలి.
- అన్ని జిల్లా కేంద్రాల్లో స్పోర్ట్స్ స్కూళ్లు ఉండాలి. ఏటా జిల్లా వ్యాప్తంగా స్కూళ్ల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులకు అందులో ప్రవేశం కల్పించాలి.
- ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి. ఆటల్లో రాణిస్తూ అదనపు సమయం వెచ్చించే విద్యార్థులకు ప్రత్యేకంగా సబ్జెక్టు తరగతులు నిర్వహించాలి. ఆటలకు, చదువుకు పోటీ పెట్టకూడదు.
- స్పోర్ట్స్ విద్యార్థులను నిరుత్సాహపరిచేలా కొంతమంది సబ్జెక్టు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉంటారు. ఆ పద్ధతి సరైంది కాదు.
- వివిధ క్రీడల్లో రాణించే విద్యార్థులను పాటవ పరీక్ష ద్వారా వేరు చేసి, శిక్షణ ఇవ్వాలి.
- క్రీడల్లో రాణించటం ద్వారా విద్య, ఉపాధి, గుర్తింపు పొందవచ్చుననే భరోసా ప్రభుత్వం కలిగించాలి. అప్పుడు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఆటలకు ప్రోత్సహిస్తారు.



కూడా ఆట వస్తువులు లేవు. నిబంధనల ప్రకారం ... ఉన్నత పాఠశాలల్లో చెస్ బోర్డు, సాఫ్ట్ బాల్, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, త్రో బాల్, హాకీ స్టిక్కు, హ్యాండ్ బాల్, బేస్ బాల్, రింగులు, క్రికెట్, బాక్సింగ్ కిట్లు ఉండాలి. ఇలాంటివన్నీ ఉన్న స్కూళ్లు నూటికి పదో, పన్నెండో ఉన్నాయి. ఆట వస్తువుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలి. కానీ, స్కూళ్లకు అలాంటి సహకారం అందటం లేదు. కొన్నిచోట్ల దాతల సహాయంతో సమకూర్చుకుంటున్న పరిస్థితి ఉంది!

కార్పొరేట్ స్కూళ్లు మరీ అధ్వానం

ఇక ప్రయివేటు, కార్పొరేటు స్కూళ్ల పరిస్థితి మరీ దారుణం. ఆటస్థలాలు లేని స్కూళ్లే అత్యధికం. కానీ, ప్రభుత్వ లెక్కలు దీనికి పూర్తిగా భిన్నం. 90.28 శాతం స్కూళ్లకు ఆటస్థలాలు ఉన్నాయని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. ఇది వాస్తవానికి ఎంత విరుద్ధమో సాధారణ పౌరులకు కూడా తెలుసు. కోళ్ల ఫారాల లాంటి ఇరుకిరుకు భవనాల్లో వేలాది ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థలు నడుస్తున్నాయి. నిబంధనల ప్రకారం స్కూలుకు ఆటస్థలం ఉండాలి. అందుకని కాగితాల్లో ఏదోకటి చూపిస్తున్నారు. స్కూలుకు దగ్గరగా ఉన్న ఏ ఖాళీ స్థలాన్ని అయినా మైదానంగా చూపించి అనుమతులు పొందుతున్నారు. విద్యాశాఖాధికారులకు ఈ విషయం స్పష్టంగా తెలుసు. అయినా పట్టించుకోవడం లేదు. ఆటల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపుకు ఇది నిదర్శనం.

చాలా ప్రయివేటు, కార్పొరేటు స్కూళ్లలో పిఇటిలు చేసే పని – పిఇటి విధులకు పూర్తిగా భిన్నం. విద్యార్థులు టై కట్టారా? షూ వేశారా? ప్రాపర్ యూనిఫాంతో వచ్చారా? లేదా? ఇలాంటి తనిఖీలు చేయటానికే పరిమితం. ఆడుకోవటానికి మైదానాలు లేని చోట వ్యాయామ ఉపాధ్యాయులు చేసే పని ఇంతకు మించి ఇంకేం ఉంటుంది?

ఎందుకిలా జరుగుతోంది?

ఎక్కువ మార్కులు, ర్యాంకులు అనేది కార్పొరేటు విద్యా సంస్థల విధానం. మార్కులకు ఆటలు అడ్డంకి అనేది వారి ఆచరణ. అందుకే– వారి కరికులంలో ఆటలకు స్థానం లేదు. ఉన్నా ప్రాధాన్యం ఉండదు. ఆటల వల్ల సమయం వృథా అయిపోతుందని, దాని వల్ల ర్యాంకుల్లో వెనకబడిపోతామని భావిస్తారు. రాష్ట్రంలో 30 ఏళ్ల నుంచి కార్పొరేటు విద్యాసంస్థలు విస్తరిస్తున్నాయి. ఇన్నేళ్లలో ఒక్క క్రీడాకారుడు కూడా ఈ సంస్థల నుంచి రాలేదు. చెస్ వంటి వాటిలో రాణించే వారికి స్పాన్సర్లుగా వ్యవహరించి, పేరొందిన సందర్భాలు మాత్రం ఉన్నాయి.

'మా దగ్గర పిల్లలను చదూకోవటానికి మాత్రమే జాయిన్ చేస్తారు. ఆటల్లో రాణించాలని కోరుకోరు. తల్లిదండ్రుల కోరికకు అనుగుణంగానే మా ప్రాధాన్యాలు ఉంటాయి..' అని ఒక కార్పొరేటు విద్యాసంస్థ డైరెక్టరు వ్యాఖ్యానించారు. ఆయన మాటల్లో కొంత నిజం ఉంది. తల్లిదండ్రులు కూడా పిల్లల మార్కుల గురించి

అక్కడ మైదానం లేని స్కూళ్లు ఉండవు

ఆటలకు సంబంధించి చైనా, క్యూబా అనుసరిస్తున్న విధానాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి. అక్కడ స్కూళ్లు కేవలం పుస్తకాల చదువుకే పరిమితం కావు. ఆటలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాయి. చైనాలో చాలా చిన్న వయస్సు నుంచి పిల్లలు ఆటలపై దృష్టి సారిస్తారు. ప్రతి పాఠశాలకు విశాలమైన ఆటస్థలాలు, విస్తారమైన ఆట సామగ్రి తప్పనిసరి. ఒక్కో స్కూల్లో నలుగురైదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు ఉంటారు. చదువులతో పాటే ఆటల్లోనూ, క్రీడల్లోనూ శిక్షణ ఇస్తారు. పిల్లల ఆసక్తిని, రాణింపునూ పరిగణనలోకి తీసుకొని స్పోర్ట్స్ స్కూల్లో చేర్పిస్తారు. చైనాలో ప్రతి ఒక్కరూ రెండు, మూడు క్రీడల్లో అవగాహన, నైపుణ్యం కలిగి ఉంటారు. క్యూబా విద్యార్థులు ప్రతిరోజూ మైదానంలో గడుపుతారు. దేశం మొత్తమ్మీద ఆటస్థలం లేని పాఠశాల ఒక్కటి కూడా కనిపించదు. అమెరికా, యూరప్ దేశాలు కూడా ఆటస్థలాలు లేని స్కూళ్లు ఉండవు. ప్రపంచ క్రీడాపోటీల్లో చైనా గొప్పగా రాణించటానికి పాఠశాల ఆటస్థలాలే మూలం. ప్రాథమిక స్థాయిలో కృషి చేయకుండా ఏ ఆటల్లోనూ రాణించలేము. ఒలింపిక్స్ వంటి వేదికలకు మనం కూడా వందలాదిమందిని పంపాలంటే– పాఠశాల ఆటస్థలాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే!

ఒక పీరియడ్ ఆటలు ఉండాలి

నేను ఒక కార్పొరేట్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. నాకు ఆటలంటే ఇష్టం. బాగా ఆడుకోవాలని ఉంటుంది. అలా అని చదువును నిర్లక్ష్యం చేయను. మార్కులు బాగానే వస్తాయి. కానీ, ఆడుకోవటానికి అసలు అవకాశం లేదు. రాత్రి 7 గంటలకు వరకూ స్కూల్లోనే ఉంచుతున్నారు. ఆదివారం హోం వర్కులోనే గడిచిపోతుంది. వేసవి కాలం వస్తేనే ఆడుకోవడానికి వీలవుతుంది. అందుకనే వేసవి సెలవులు అయిపోతున్నప్పుడు చాలా బాధగా అనిపించింది. మమ్మల్ని ప్రతి శనివారం గ్రౌండులోకి తీసుకెళతారు. అక్కడ ఆడుకునేంత స్పేస్ ఉండదు. ఆటలు ఆడిన సంతృప్తే ఉండదు. రోజూ కనీసం ఒక పీరియడ్ ఆటలు ఉండాలి. ఆడుకుంటే మనసుకు హాయిగా ఉంటుంది. ఉత్సాహంగా ఉంటుంది.

- ఆర్.సూర్యపవన్, విశాఖపట్నం.



చేసే విచారణ - పిల్లల ఆటల గురించి, స్కూలు ఆటస్థలం గురించి చేయరు. ప్రభుత్వమైతే - ఈ అంశాన్ని అసలు పట్టించుకోవటం లేదు. పట్టించుకునేది అయితే- లేని ఆటస్థలాలను కాగితాల్లో చూపించే విద్యాసంస్థలపై ఎప్పుడో చర్యలు తీసుకునేది.

వివిధ రాష్ట్రాల్లో మైదానాలు

ఆటస్థలాలు ఎక్కువగా ఏ రాష్ట్రంలో ఉన్నాయో ఆ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఎక్కువగా వస్తారు. మన దేశంలో ఆటస్థలాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రం పంజాబ్. అక్కడ గ్రామీణ క్రీడలు ఇప్పటికీ వర్ధిల్లటానికి ఇదొక కారణం. తరువాతి స్థానాల్లో చండీఘఢ్, మహారాష్ట్ర ఉన్నాయి. 2012 - 13 సంవత్సరపు ప్రభుత్వ నివేదిక ప్రకారం- మనదేశంలో 56.58 శాతం పాఠశాలలకు ఆటస్థలాలు ఉన్నాయి. హర్యానా, ఢిల్లీ, కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడులో జాతీయ సగటు కన్నా ఎక్కువ ఆటస్థలాలు ఉన్నాయి. వివిధ క్రీడల్లో ఈ రాష్ట్రాల నుంచే ఎక్కువ మంది తర్ఫీదు పొంది వస్తున్నారు. ఆట మైదానాలు అత్యంత తక్కువగా ఉన్న రాష్ట్రాలు : మేఘాలయ (34.17), బీహార్ (37.03), జమ్మూ కశ్మీర్ (37.04).

దక్షిణ భారతదేశంలో తక్కువ స్కూలు ప్లే గ్రౌండ్సు ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కార్పొరేట్ స్కూళ్ల కాగితపు లెక్కలతో సహా 54.95 శాతం మాత్రమే ఆటస్థలాలు ఉన్నాయి. ఇది జాతీయ సగటు కన్నా కూడా తక్కువ. మిగిలిన రాష్ట్రాల్లో తమిళనాడు 76.42 శాతం, కేరళ 72.85, కర్నాటక 67.41, పాండిచ్చేరి 66.20, తెలంగాణా 61.68 శాతం మైదానాలు ఉన్నాయి.

చదువూ ఆటా ఒకటే!

అసలు పిల్లలకు ఆట వేరు.. చదువు వేరు... అని అనుకోవటమే పెద్ద పొరపాటు. ఈ అవగాహనా లోపం వల్లే మన విద్యా విధానం ఇలా నడుస్తోంది. పిల్లలను తీర్చిదిద్దడంలో ఆటలు కీలక పాత్ర పోషిస్తాయి. కిక్కిరిసిన గదుల్లో ఎక్కించే పాఠాల నుంచి పిల్లలకు రిలీఫ్‌నిస్తాయి. పేరుకుపోతున్న ఒత్తిడిని దూది పింజలా ఎగరగొడతాయి. పాఠాలను అర్థం చేసుకునే బలాన్నిస్తాయి. మానసిక ధైర్యాన్నీ, స్థైర్యాన్నీ అందిస్తాయి. గెలుపోటములు సహజమనే జీవిత సత్యాన్ని ప్రబోధిస్తాయి. గెలవడం ఒక్కటే జీవితం కాదు. నెంబరు వన్ ఒక్కటే స్థానం కాదు. జీవితమంటే- గెలవడం కోసం చేసే ప్రయత్నం, చేరటానికి చేసే ప్రయాణం. అందరితో కలిసి మెలసి ఆడే ఆటల్లోంచి మాత్రమే ఇలాంటి జీవిత సత్యాలు పిల్లలకు తెలిసొస్తాయి. అందుకే ఆటలు చదువులో ఒక భాగం కావాలి... జీవితానికి ఒక అవసరంగా, ఆసరాగా నిలవాలి!



✦

మైదానం

మైదానం అచ్చం అమ్మలా ఉంటుంది
రారా రమ్మని చేతులు చాచి
పిలుస్తూ ఉంటుంది
నా వైపు ఎప్పుడూ ప్రేమగా
చూస్తూ ఉంటుంది
మైదానం అంటే -
వట్టి మట్టి, కాసింత పచ్చికా కాదు;
హత్తుకునే ప్రేమా,
హాయినిచ్చే అమ్మ ఒడి ...
వేసవి సెలవుల్లో మేమంతా ఆడుకున్నప్పుడు
ఎంత పొంగి పరవశించిందో ...
అరుపులతో అల్లరితో నవ్వులతో
ఎంత ఎంత కళకళ్లాడుతూ వెలిగిందో ...
ఎన్నెన్ని సందళ్ల నగారాగా మోగిందో ....
ఇప్పుడు నాలాగానే
మైదానం కూడా ఒంటరిగా ఉంది
స్కూలుకు వస్తూ వెళుతూ
రోజూ చూస్తూనే ఉన్నాను
జాలిగా చూస్తూ పిలుస్తున్నట్టే ఉంది
ఆటలకు ఆహ్వానం పలుకుతూనే ఉంది
నేను తరగతి గదిలో ఉన్నాను
నా మనసు మాత్రం తాళం
వేసిన గేటును దాటి
మైదానంలో ఆడుకుంటోంది!

- శాంతిమిత్ర

వింత లోకం

బస్సులో కసరత్తులు

లండన్‌వాసులకు జిమ్ వరకు బస్సులో వెళ్లి కసరత్తులు చేయాల్సిన అవసరం లేదంటోంది ఓ ప్రముఖ ఫిట్‌నెస్ సంస్థ. రైడ్ టు రెబెల్ బస్సుల పేరిట కొన్ని సర్వీసులు మొదలెట్టబోతోందట. వాటిల్లో సీట్ల బదులు ఎక్సర్సైజ్ సైకిళ్ళను అమరుస్తారు. అన్ని ముఖ్య రూట్ల నుంచీ బస్సులు నడుస్తాయి. వీటిలో ఆఫీస్‌కు వెళుతూనో, వస్తూనో వ్యాయామం చేసేయొచ్చు. రూట్లో తగిలే సంస్థ ఫిట్‌నెస్ స్టుడియోలో ఆగి హాయిగా స్నానం చేసి రెడీ అయిపోయి పనికెళ్లిపోవచ్చు. ఈ ఆలోచన తెగ నచ్చేసింది లండన్‌వాసులకు. ఇప్పటికే 8 వేల మందికి పైగా బుకింగ్ చేసేసుకున్నారు. వీళ్ళు మన దేశీ బస్సుల్లో ఎప్పుడూ ఎక్కి ఉండరేమో. ఏ సైకిళ్లు లేకుండానే కావాల్సినంత వ్యాయామం ఎటువంటి పరికరాలు లేకుండా చేసేయొచ్చని తెలీదేమో.

హుర్రే.. హిప్లెట్

హిప్ హాప్‌కు, బ్యాలేకు ఎక్కడ పొంతన కుదురుతుంది? బహుశా హిప్లెట్‌లోనేమో. అమెరికా నృత్యకారుడు హోమర్ హాన్స్ బ్రియాంట్ ఈ రెండు నృత్య రీతులకు మధ్య బ్రిడ్జి వేశాడు. షికాగో మల్టీ కల్చరల్ డ్యాన్స్ సెంటర్‌లోని తన విద్యార్థులతో ఈ కొత్త స్టెప్‌లు వేయించాడు. అక్కడితో ఆగిపోకుండా ఓ ప్రముఖ టీవీ కార్యక్రమంలోను ప్రదర్శించడంతో పెద్ద సంచలనం రేకెత్తించింది. చిన్నపుడు డ్యాన్స్ నేర్చుకోడానికి హోమర్ ఓ టీచర్ దగ్గరకు వెళితే తొలుత బ్యాలే నేర్చుకోమని సలహా ఇచ్చారట. అది అన్ని నృత్య రీతులకు తగ్గట్టు శరీరాన్ని మలుస్తుందని చెప్పడంతో అలానే చేశాడు. పెద్దయ్యాక అతడికది ఎంతో ఉపయోగపడింది. లేడీ గాగా, ఒబామా పిల్లలకు కూడా డ్యాన్స్ క్లాసులు తీసుకునే స్థాయికి ప్రొఫెషనల్‌గా ఎదిగిపోయాడు.





కోతుల రాజ్యం

చైనాలోని జియాన్‌ఫెంగ్ గ్రామం మకాక్ కోతులుండే ఓ పర్యాటక కేంద్రం అనేది ఒకప్పటి మాట. ఇప్పుడది కోతుల రాజ్యం. కొన్నాళ్ల క్రితం పర్యాటకంగా తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో దగ్గరలోని అడవుల్లో ఉండే మకాక్ కోతులను గ్రామం దారి పట్టించారు స్థానికులు. అలా 48 రోజుల్లో 73 కోతుల్ని ఆహారం ఎర చూపి గ్రామానికి రప్పించారు. వాటి గురించి మంచి ప్రచారం చేయడంతో సందర్శకులు కూడా రయ్యిమంటూ వచ్చారు. ఇదేదో మంచి వ్యాపారమేనని జౌ జెన్‌గుయ్ అనే వ్యాపారి వాటి ఆలనాపాలనా చూసుకుంటూ లాభంలో వాటా తీసుకునేవాడు. కానీ కొన్ని నెలల క్రితం ఆయన చనిపోవడంతో సంస్థ మూతబడింది. కోతుల సంఖ్య అప్పటికే 600కు చేరింది. వాటి తిండీతిప్పలు చూసే దిక్కు లేక అవి గ్రామస్తుల ఇళ్ల మీద పడ్డాయి. పర్యాటకులు ఇస్తే తీసుకునేవి కాస్తా ఇప్పుడు దౌర్జన్యంగా లాక్కునే స్టేజ్‌కు చేరిపోయాయి. వాటినేమన్నా చేద్దామా అంటే చైనాలో జంతు సంరక్షణ చట్టం ప్రకారం అవి క్లాస్-2 జోన్‌లోకి వస్తాయి. అంటే వాటిని టచ్ చేస్తే కష్టం. గ్రామం ఖాళీ చేసే వరకూ విషయం వెళ్లకుండా కొందరు జంతు పరిరక్షకులు వాటిలో 300 పైగా కోతుల్ని వేరే సురక్షిత ప్రాంతాలకు ప్రభుత్వం అనుమతితో తరలించారు. కానీ మిగిలినవి ఇంకా పెరిగిపోతూనే ఉన్నాయి.

పంటకు సోలార్ రక్షణ

ఓ సామాన్య రైతు సౌర శక్తితో అద్భుతాల్ని సృష్టిస్తున్నాడు. సోలార్ వెలుగుల్ని పొలానికి పట్టుకెళ్లాడు. అడవి జంతువుల నుంచి పొలాన్ని కాపాడుకునేందుకు కావలి పెట్టాడు. ఊరి వారికి కొత్త పద్ధతిని పరిచయం చేసి పంటను కాపాడుకోవడంలో సాయపడుతున్నాడు. సోలార్ కారును కూడా అభివృద్ధి చేస్తున్న ఆ రైతే మెదక్ జిల్లాకు చెందిన రామచంద్రయ్య.

రామచంద్రయ్య స్వగ్రామం మెదక్ జిల్లా పుల్కల్ మండలం తాడ్‌పల్లి. ఆయన ఇంట్లో అడుగు పెట్టగానే మనకు ఏదో కరెంటు పనులు చేసే వర్క్ షాప్‌లోకి వచ్చినట్లు అనిపిస్తుంది. నిత్యం సోలార్ పరికరాలతో ఏదో ఒక ప్రయోగం చేస్తూ ఉంటాడాయన. ఇంటి నిండా ఎలక్ట్రికల్ పరికరాలు, వైర్లు, బల్బులు, స్విచ్చులే దర్శనమిస్తాయి.

రామచంద్రయ్య చదివింది 10వ తరగతే. పొలం పనులు చేసుకోక ఈ ప్రయోగాలేంటని అనేవాళ్లు. ఆ ప్రయోగాలు తర్వాతర్వాత అందరికీ ఉపయోగపడేవని ఊళ్లో వాళ్లూహించి ఉండరు. అతివృష్టి, అనావృష్టి, కరెంటు కోతతో పాటు అక్కడ ప్రధాన సమస్య పొలం మీద పడే అడవి జంతువులు. కోతులు, అడవి పందులు చేసే విధ్వంసం అంతా ఇంతా కాదు. ఎంత పటిష్టంగా కంచె వేసుకున్నా రాత్రింబగళ్లు కాపలాకు ఉన్నా కూడా తీవ్ర నష్టం చేసేవి. వాటిని కట్టడి చేసేందుకు ఏం చేయాలా అని ఆలోచిస్తుండేవాడు రామచంద్రయ్య. కోతుల్ని తరమాలంటే అంతకు ముందు కొండ ముచ్చులను తీసుకు వస్తే భయపడి పారిపోయేవి. కానీ తర్వాతర్వాత వాటికి కూడా అవి భయపడటం లేదు. ఇవే ఇలా ఉంటే ఇక అడవి పందుల గురించి వేరే చెప్పాలా? ముఖ్యంగా రాత్రి సమయాల్లో అడవి పందులకు ఎంత దూరంగా ఉంటే అంత మేలు. ఎందుకంటే వాటి దాడిలో మనుషులు చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.

అడవి జంతువుల నుండి పంటను రక్షించుకోవడం కోసం రామచంద్రయ్య చేసిన ప్రయోగమే ఈ రోజు అతణ్ని హీరోగా నిలిపింది. అందుకు సోలార్ అనే మాట అతడి బుర్రలో పాదరసంలా కదిలింది. ఒక పోల్ తీసుకుని దానికి సోలార్ ప్యానెల్ అమర్చాడు. ఒక ఎలక్ట్రికల్ సర్క్యూట్ తయారు చేశాడు. దానికి అనుసంధానంగా పైన వెలుగుతూ ఆరిపోతుండే బ్లింకింగ్ లైట్ ఒక దానిని ఏర్పాటు చేశాడు. దానికి ఇరు పక్కలా చిన్న లౌడ్ స్పీకర్లు పెట్టి అందులో నుంచి మూడు రకాల శబ్దాలు వచ్చే విధంగా ఏర్పాటు చేశాడు. ఒకటి కుక్కలు అరిచినట్లు, రెండోది జనాలు ఉస్కో ఉస్కో అని తరిమినట్లు, మూడోది పోలీస్ సైరన్ మోగినట్టు ఉంటుంది. ఇలా మైకులోంచి మూడు రకాల సౌండ్లు వస్తుంటే.. ఆ శబ్దాలకు అనుగుణంగా లైట్ బ్లింక్ అవుతుంది. కాకపోతే పగలు పెద్దగా కనిపించదు. రాత్రిపూట మాత్రం దాని వెలుతురు పొలాల దగ్గరకు రాబోయే అడవి జంతువుల వెన్నులో వణుకు పుట్టిస్తుంది. అరుపులతో లైట్ గిరగిర తిరుగుతుంటే అవి భయానికి, అయోమయానికి లోనై పారిపోతుంటాయి. ఎలుకల బాధ కూడా వదిలిపోయింది. పగలంతా ఈ పరికరం సోలార్ పవర్‌తో చార్జ్ అవుతుంది. ఇందులో అమర్చిన టైమర్ సాయంతో సాయంత్రం ఏడు గంటల నుంచి ఇది పనిచేయడం మొదలు పెడుతుంది. తెల్లారి ఏడింటికి ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది. సెట్ చేసిన టైం ప్రకారం ప్రతి పది నిమిషాలకోసారి పెద్ద శబ్దం చేస్తుంది. ఈ వినూత్న వ్యవస్థతో రైతులు సంతోషంగా పంటలు వేసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు వీటిని పొలంలో అమర్చుకున్నారు. పంట రక్షణ కోసం సోలార్ కంచె ఇప్పటికే అందుబాటులో ఉన్నా అంత రక్షణ ఉండదు. మనుషులకు, ఇతర ప్రాణులకు కూడా ప్రమాదమే. రామచంద్రయ్య రూపొందించిన ఈ వ్యవస్థ నాలుగేళ్లు అవుతున్నా పెద్దగా రిపేర్ రాలేదట. ఒక్కో సైరన్ పోల్ విలువ 15 వేల రూపాయలు. దానితో విలువైన పంటను కాపాడుకోవడానికి దీర్ఘకాలిక పరిష్కారం కాబట్టి రైతులు దీనిని కొనుగోలు చేస్తున్నారు.

దోమకు కాటు...

కంచె కట్టడంలోనే కాదు పంటను కబళించే క్రిములను, దోమలను కట్టడి చేయడం కోసం కూడా ఓ వినూత్న ప్రయోగాన్ని చేశాడు. పురుగు మందుల అవసరం లేకుండా సోలార్ లైట్‌ను వినియోగంలోకి తెచ్చాడు. ఈ లైటు వెలగగానే



కీటకాలను ఆకర్షిస్తుంది. సెన్సార్ మూలంగా లైటు వద్దకు కీటకాలు వెళ్లీ వెళ్లగానే ఆటోమేటిగ్గా వెలుగుతుంది. పురుగులు వలయంలో పడి చనిపోతాయి. అంతే కాక రామచంద్రయ్య అద్భుతమైన మరో ఆవిష్కరణ సోలార్ కారు. ఇందుకోసం ఆయన పాత మారుతీ 800 మోడల్ కారు ఒక దానిని తీసుకుని దానిపై భాగంలో సోలార్ ప్యానెల్‌ను బిగించాడు. దాని నుంచి జనరేట్ అయ్యే కరెంటును ఇంజన్‌కు అనుసంధానం చేసి కారును పరుగులు పెట్టించాడు. మైలేజ్ సుమారుగా 30–35 కిలోమీటర్లు వస్తుంది. రాత్రి వేళల్లో డీజిల్‌తో నడుస్తుంది. మరికొన్ని ప్రయోగాలు చేస్తే ఇంచుమించు 70 కిలోమీటర్లు మైలేజ్ ఇచ్చే అవకాశం ఉంది. సోలార్ ప్యానెల్ అమర్చడానికి 40 వేల రూపాయలు ఖర్చైంది. ప్రయోగ దశలో ఎక్కువ ఖర్చు అవుతున్నప్పటికీ రానురాను ఈ వ్యయం మరింత తగ్గే అవకాశం ఉంది. ఇలా నిత్యం ఏదో ఒక సోలార్ ప్రయోగాన్ని చేస్తున్న రామచంద్రయ్య మరెన్ని అద్భుతమైన ఆవిష్కరణలకు ఊపిరినిస్తాడో.

- అనంతోజు మోహన కృష్ణ

పెళ్లికి ముందు ప్రేమ ప్రయాణం.. పెళ్లి తర్వాత హనీమూన్.. ఈ రెండే తెలుసు చాలా జంటలకు. కానీ ఓ సుదూర యాత్ర.. ప్రయాణానికి ప్రయాణానికి మధ్య ఓ పెళ్లి అనేది మాత్రమే తెలుసంటోంది ఓ అమెరికన్ యాక్రోబాట్ జంట. భూగోళమంతా చుట్టేస్తూ ముచ్చటగా వరస పెట్టి మళ్లీ మళ్లీ పెళ్లిళ్లు చేసుకుంటోంది. ఏకంగా 6 ఖండాల్లోని 12 దేశాల్లో ఇప్పటికే 43 సార్లు ఈ జంట పెళ్లాడింది. ఆరు ఖండాల్లో అరవై సార్లు కళ్యాణం జరిగే వరకు వీరి యాత్ర ఆగేలా లేదు. ఇలానే ఎందుకంటే వారిరువురి ప్రేమనీ ప్రపంచమంతా ప్రకటించడానికేనంటోంది చీత ప్లాట్, రియాన్ ఉడ్‌యార్డ్‌ల జంట. పెళ్లికి పేరొందిన కట్టడాలు, టూరిస్టులు సాక్షులుగా మారితే కొన్ని ప్రదేశాల్లో జిరాఫీలు, ఏనుగులు, ఒంటెలు పెళ్లి పెద్దలయ్యాయి.

ఆరు ఖండాలు.. అరవై పెళ్లిళ్లు

లాస్ ఏంజిల్స్‌లో ఏరియల్ యాక్రోబాట్‌లుగా ఆరితేరిన చీత ప్లాట్, ఉడ్‌యార్డ్‌లు భారీ పెళ్లి విందుకయ్యే ఖర్చును తమ ప్రేమ పెళ్లి యాత్రకు సర్దుబాటు చేసుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా, శాన్ డియాగోలో థియేటర్ ఆర్ట్, డ్యాన్స్‌లో శిక్షణ పూర్తి చేసిన ప్లాట్ (30) గొప్ప థియేటర్ ఆర్టిస్ట్. అమెరికాలో ఎన్నో ప్రదర్శనలతో పాటు డిస్నీ వంటి ప్రముఖ సంస్థలతో భాగమవుతూ 'ది ప్లాట్ బ్రదర్స్' టీవీ షో ద్వారా మరింతగా గుర్తింపు తెచ్చుకున్నాడు. టీవీ షోల ద్వారా ఎక్కువ మందికి పరిచయమైనా అతనో గొప్ప యాక్రోబాట్. అంతకు మించి తనో యేరియలిస్ట్‌గా వివిధ దేశాల్లో తన ప్రతిభని చాటుకున్నాడు. మంచి యాక్టర్‌గా ఏరియల్ యాక్రోబ్యాట్‌గా పేరుతెచ్చుకుంది రియాన్ వుడ్ యార్డ్(32). టివి షోస్‌తో ఎప్పుడూ బిజీగా ఉండే ఆమె జీవితాన్ని ప్లాట్ పరిచయం మలుపు తిప్పింది.

తొలి పరిచయం

కాలిఫోర్నియాలోని వ్యాన్ నైస్ జిమ్‌లో ప్లాట్, వుడ్‌యార్డ్‌ని మొట్టమొదటిసారి చూశాడు. తొలి పరిచయంలోనే ఆమెని ఇష్టపడ్డ ప్లాట్ సరిగ్గా ఏడాది తర్వాత వుడ్‌యార్డ్ ఎదుట తన మనసులో మాట బైటపెట్టాడు. వుడ్‌యార్డ్ అక్కడే 'యెస్' చెప్పేయడంతో తోటి యాక్రోబాట్ కళాకారుల మధ్యే రింగ్ తొడిగేశాడు. పెళ్లి తతంగానికి వేలకు వేలు డబ్బులు కుమ్మరించ కూడదని ఇద్దరూ అప్పుడే నిర్ణయించుకున్నారు. సింపుల్‌గా చాలా వినూత్నంగా తమ వివాహాన్ని ఎలా చేసుకోవాలోనని ఆలోచిస్తుండగా వారికి మళ్లీ మళ్లీ పెళ్లి ఐడియా తట్టింది. అంతే 'వరల్డ్ వైడ్ వెడ్డింగ్'కి శ్రీకారం చుట్టారిద్దరూ.

కాలిఫోర్నియాలో అప్పటికే వారు స్థిరపడ్డ నగరం లాస్‌ఏంజెల్స్ అత్యంత ఖరీదైన నగరాల్లో ఒకటి. అలాంటి నగరాల్లో ఉండే ఖర్చుల గురించి ఇద్దరికీ అవగాహన కలగడంతో తక్కువ ఖర్చయ్యే దేశాలనే తమ వెడ్డింగ్ సిటీస్‌గా ఎంచుకున్నారు. వృత్తి రీత్యా ప్లాట్ అప్పటికే ఎన్నో దేశాలను చుట్టొచ్చాడు. అందుకే టూర్ ప్లానింగ్‌ని తన భాద్యతగానే తీసుకున్నాడు. ఫ్లైట్ టికెట్‌లలో రాయితీని అందించే ఎయిర్‌లైన్స్, తక్కువ

వ్యయంలో ఒక మాదిరి హోటళ్లలో బసతోనే వారి ప్రయాణం కొనసాగింది. ఇలా మూడు నెలలు ప్లానింగ్‌కే అయ్యింది.

లాస్ ఏంజెల్స్ నుండి 2014 ఫిబ్రవరి 8న కొలంబో దిశగా వీరి తొలి పెళ్లి ప్రయాణం మొదలైంది. మధ్యలో బొగాటోలో వీరిద్దరూ ఒకటయ్యారు. వందలాది అతిథుల మధ్య కాకపోయినా పరిచయంలేని కొత్త వ్యక్తుల చప్పట్ల మధ్య పెళ్లి వేడుకని మరో సారి కొలంబోలో జరుపుకున్నారు. 'పెళ్లికూతురు అలంకరణ కోసం అమ్మాయిలు వేలకు వేలు ఖర్చు చేస్తుంటారు. వెడ్డింగ్ జ్యూయెలరీతో పాటు మేకప్‌ని తప్పించుకోగలిగాను' అంటూ చిరునవ్వులు చిందిస్తుంది వుడ్‌యార్డ్. కొలంబియా నుండి స్పెయిన్, ఐర్‌లాండ్, మొరాకో, ఈజిప్ట్, కెన్యా, ఇండియా ఇలా వివిధ ప్రాంతాలకు చేరుకుని ఈ జంట అనేక సార్లు పెళ్లాడినా ఖర్చుని తగ్గించేందుకు ఒక్క వెడ్డింగ్ డ్రెస్‌కే పరిమితమయ్యారు. వివిధ ప్రదేశాల్ని, పరిసరాల్ని ఆస్వాదిస్తూ, ప్రయాణంలో ఎదురైన కష్టాల్ని చెదరని చిరునవ్వుతో స్వాగతం పలికేవారిద్దరూ. చేరుకున్న ప్రదేశంలో ఉండే స్థానికులతోపాటు, అక్కడి స్థూపాలు, పేరొందిన కట్టడాలు వీరి పెళ్లి వేడుకలకి సాక్షులు. కొన్ని సార్లు టూరిస్టుల మధ్య ఇద్దరూ ఒక్కటైతే మరి కొన్ని ప్రదేశాల్లో జిరాఫీలు, ఏనుగులు వీరి చేయి కలిపేవి. థాయిలాండ్‌లోని ర్యాన్ టాంగ్ ఎలిఫెంట్ సెంటర్‌తో పాటు ఈజిప్ట్ ఒంటెలు అధికంగా ఉండే ఎడారి ప్రాంతాలు, కెన్యాలోని జిరాఫీ సెంటర్లు వీరి పెళ్లి వేదికలుగా మారాయి. స్పెయిన్‌లోని ఒంటెల సమక్షంలో ఏకమైన ప్లాట్, వుడ్‌యార్డ్‌లు వాటిని అస్సలు వదిలి రాలేకపోయారు. తమ పెళ్లి అనుభూతులతో పాటు అత్యంత సన్నిహితంగా మెలిగిన ఆ మూగజీవాలతో గడిపిన క్షణాల్ని సెల్ఫీల్లో భద్రపరుచుకున్నారు. తమ పెళ్లి వేడుకని కెమేరాల్లో బంధించడంలో తోటి ప్రయాణీకులు, సెల్ఫీ స్టిక్స్ కొన్ని సార్లు సహాయపడ్డారు. అన్నింటికీ మించి వాళ్ళు తర్ఫీదు పొందిన యాక్రోబ్యాట్ విద్య ఫోటో క్యాప్చర్‌కి వారికి ఎక్కువగా సాయపడింది.

థాయ్ లాండ్‌లో....



ఐర్లాండ్‌లోని విక్‌లో పర్వతాలు, దుబియన్ ఎయిర్‌పోర్ట్, మొరాకోలోని క్యాస్‌కేడ్ -డి-క్యుజోడ్ జలపాతాలు, బ్యాంకాక్‌లోని సువాన్ లువాన్ రమా 9 పార్క్, ఈజిప్ట్ పిరమిడ్‌లు ఉన్న ప్రాంతాలు వారి వివాహ వేదికలుగా మారాయి. నిరంతరం కర్రలు పట్టుకు తిరిగే కెన్యా ఆదివాసీలు సైతం మసాయ్ తంతుతో మరోమారు వీరి బంధానికి పాటలు పాడారు. ప్రయాణ ఇతర ఖర్చులకు వారి విద్యే సాయపడింది. వివిధ దేశాల్లో ఆసక్తికలిగిన వారికి యాక్రోబాట్ కళను బోధిస్తూ సాగేవారు. కొన్ని ప్రదేశాల్లో ప్రదర్శనలిచ్చేవారు. స్పెయిన్ వంటి దేశాల్లో ప్రదర్శనల ద్వారా వీరు సంపాదించిన డబ్బు తమ ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడింది. స్పెయిన్‌లో కళ్యాణ తతంగం పూర్తిచేసుకుని మ్యాడ్రిడ్‌లో పేరొందిన పార్కుల్ని కలియదిరిగారు. వీరి పెళ్లి ప్రయాణం గురించి పదిమందితో పంచుకోవడంతో 'హనీఫండ్' వెబ్‌సైట్ ద్వారా నిధులను సేకరించి కొత్త జంటకు ఇచ్చారు. హనీమూన్ జంటలకి ఆర్థికసాయాన్ని అందించే ఈ వెబ్‌సైట్‌లో తమ ప్రయాణించాలనుకునే దేశాల వివరాల్ని పోస్టు చేస్తూ తగిన ఆర్థిక సాయాన్ని అందుకున్నారు. ఒక్కో దేశంలో వారం రోజులు ఉంటూ మూడు నెలల పాటు నిరంతరం ప్రయాణించిన ఈ జంట ఎన్నో అందమైన అనుభూతులని పోగుచేసుకుంది. ఎన్ని దేశాలు చుట్టొచ్చినా తమకంటూ ఇష్టమైన ప్రదేశమొకటుంటుంది. ప్లాట్, వుడ్‌యార్డ్‌లకీ తమని ప్రత్యేకంగా ఆకర్షించిన కొన్ని ప్రదేశాలున్నాయి. ఈజిప్ట్ గీజా పిరమిడ్‌యే అది. దాని ఎదురుగా మరో పిరమిడ్‌ని తలపించే రీతిలో యాక్రోబాట్ విన్యాసంలో ఫోజిచ్చి ఫోటో దిగారు. ఐర్లాండ్ అందాలకు ఫ్లాట్ అయ్యి ఒక్క రోజులో మూడు ప్రదేశాల్లో పెళ్లి చేసుకున్నారు.

ముంబై మసాలా

ముంబయిలోని అజంతా ఎల్లోరా గుహల్లో తమ పెళ్లివేదికగా మారిన బుద్ధుని స్థూపమున్న ప్రదేశం వుడ్‌యార్డ్ మనసు దోచుకుంది. పర్వతాలపై చెక్కిన ఎన్నో అపురూప శిల్పాలు వీరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్ట్రీట్ ఫుడ్‌ని అస్సలు ముట్టని వుడ్‌యార్డ్ ముంబయి వీధుల్లో లభించే రకరకాల ఛాట్‌లకి, కరకరలాడే స్నాక్స్‌కి ఫిదా అయిపోయింది.

ఇక్కడ గడిపిన రోజులన్నీ సాగా పనీర్‌ని చికెన్ టిక్కా మసాలాతో భోజనం చేసేవారిద్దరు. ముంబయిలో లభించే చిరుతిళ్లతో పాటు మసాలాతో చేసే వివిధ భారతీయ రుచులకి అభిమానులయ్యారు ప్లాట్ వుడ్‌యార్డ్‌లు. సాగర తీరంలో సాయంత్రాలు వీరిచ్చే ప్రదర్శనలకు భారీ స్పందన వచ్చేది. ఇక్కడి నుండి సింగపూర్, ఆస్ట్రేలియా, ఫిజీకి చేరుకున్నారు. చక్కటి బడ్జెట్ ప్లానింగ్‌తో ప్రపంచవ్యాప్తంగా 12 దేశాల్లో విహరించిన ఈ జంటకి కొంత స్పాన్సర్ల సాయం కూడా అందింది. వీరు ప్రయాణించిన ప్రాంతాలకు సంబంధించి ప్లాట్ తన వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాలు హనీమూన్ స్పాట్‌లని ఎంచుకునే కొత్తజంటలకి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏడు ఖండాల్లోనూ పెళ్లాడాలని తొలుత నిర్ణయించుకున్న ఈ జంట అంటార్కిటికా ప్రాంతంలో వివాహానికి ఖర్చు ఎక్కువవుతుందని తెలిసి తమ టూర్‌ని విరమించుకుంది. హంగు ఆర్భాటాలు లేకుండా నచ్చిన ప్రాంతానికి చేరుకుని స్థానిక పద్ధతుల్లో తమ ప్రత్యేక విన్యాసాల్ని జోడించి బంధాన్ని పదే పదే కలిపేసుకుంటున్న వీరి పెళ్లి యాత్ర గమ్మత్తుగా అనిపిస్తోంది కదూ.

- అద్దేపల్లి శర్వాణి


గీజా పిరమిడ్ వద్ద..


మసాయ్ పెళ్లి తంతు..

యువతకు కొత్త కానుక

సమాజ పునర్నిర్మాణానికి కృషి-చేస్తున్న కొత్త యువతరానికి కత్తి పద్మారావు ఇస్తున్న కానుక ఈ పుస్తకం. కెరీర్ గైడెన్స్ అనేది నేడొక పాపులర్ సబ్జెక్ట్. దూసుకొస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, తోసుకొస్తున్న మార్పులు, కొత్త తరానికి ఒక సవాలు విసురుతున్నాయి. ఈ సవాలును ఎదుర్కోవడం కోసం యువత తడబాటుకు గురవుతున్నది. ఉపాధి, పెళ్లి, కుటుంబ జీవనం, సామాజిక సమస్యలలో తమ పాత్ర ఏమిటనేది నిర్ణయించుకోవాల్సిన సంధి కాలం ప్రతి ఒక్కరికీ వస్తుంది. సరైన మార్గదర్శకత్వం ఉంటే కొత్త తరం సమాజాన్ని ముందుకు నడుపుతుంది. వ్యక్తి స్వార్థం-సామాజిక ప్రయోజనాలకు మధ్యనున్న వైరుధ్యాన్ని సరైన రూపంలో విశ్లేషణ చేయగలిగితే మంచి మార్గం దొరుకుతుంది.

'నీ కోసమే నీవు జీవించు', 'ముందు నీ సామర్థ్యాన్ని పెంచుకో', 'విజయానికి ఆరు మెట్లు' ఇలా రకరకాల పేర్లతో వ్యక్తిత్వ వికాస సాహిత్యం, 'కెరీర్ గైడెన్స్' సంస్థలు చూపే మార్గం నుంచి కొత్త దారి తాకి, వ్యక్తి వికాసానికి కొత్త భాష్యం

ప్రపంచ విజేతలు-వ్యక్తిత్వ నిర్మాణం-2
ముద్రణ: లోకాయిత ప్రచురణలు-పొన్నూరు
వెల-రూ: 200/-
పేజీలు-266
ప్రతుల కొరకు: ప్రజాశక్తి, విశాలాంధ్ర, నవోదయ బుక్ హౌస్‌లు

చెప్పారు కత్తి పద్మారావు. తను ఎదుగుతూ సమాజాన్ని ఎలా ముందుకు నడపాలనే విషయాన్ని ముగ్గురు సామాజికవేత్తల జీవితాల నుండి వ్యక్తిత్వ వికాస సూత్రాలను వెలికి తీసి నవతరాన్ని నూతన మార్గానికి నడిపించే ప్రయత్నం చేశారు. వ్యక్తిత్వ నిర్మాణంలో ఉండాల్సిన తత్వాన్ని పట్టి చూపించారు. 'ఇతరులను నిందిస్తూ ఆధిపత్య ధోరణుల్లో బతుకుతూ ఇతరులపై పెత్తనం చేయాలి అనుకుంటూ వ్యక్తిత్వాలను దిగజార్చుకుంటున్న మార్గం నుండి, 'నెగటివ్' ధోరణి నుండి స్వీయ నియంత్రణ ద్వారా అధ్యయనం, సామాజికాంశాల పరిశీలన ద్వారా కొత్త తరాన్ని ఎలా తీర్చిదిద్దాలో.... కొత్త ప్రతిపాదన చేశారు.

డా.బి.ఆర్.అంబేద్కర్, బెర్ట్రాండ్ రస్సెల్, విలియం వార్డ్స్‌వర్త్ ముగ్గురు ప్రముఖుల జీవన వికాస కృషి ఈ రచయితనూ ప్రభావితం చేసింది. వారి నుండి భావి తరాలు నేర్చుకోదగ్గ విషయాలను, వదిలేయాల్సిన చర్యలను రచయిత విశ్లేషించారు. జ్ఞాన సంపాదన, స్థిర చిత్తం, శీలవంతులై ఉండటం, ధైర్య -సాహసం, కుటుంబ జీవనం, ఆహారం-వ్యాయామం మనం వీరి నుండి నేర్చుకోవాల్సినవి. అంబేద్కర్ వ్యక్తిత్వంలోని బల పార్శ్వాలను, రస్సెల్ జీవితంలోని హేతువాద దృక్పథాన్ని, వార్డ్స్‌వర్త్ ప్రకృతి వర్ణనలను, కవిత్వాన్ని ప్రపంచాన్ని ప్రభావితం చేసిన సమున్నతమైన ఉత్తేజకరమైన విశేషాలను జీవన ఘట్టాల ఆధారంగా మనకి అందించారు రచయిత.

- భవిష్య

రకరకాల ఆటలు..

అంగరం వసంత్ కలం నుండి వెలువడిన కథలు ఆటాడుకుందాం..రా! రచయిత తమిళనాడులోని హోసూరు ప్రాంతంలో ఉండటం వలన అచ్చటి సంస్కృతి భాష మొదలగు వాటి మీద పట్టు సాధించటమే కాక ఆ ప్రాంతంలో తన చిన్నతనంలో ఆడిన ఆటలను గురించి గుర్తు చేసుకుంటూ ఆ ఆటలను అందరికి పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో హోసూరు ప్రాంత మాండలికంలో కథల రూపంలో రచించారు రచయిత.

భాషలు వేరైనా, ప్రాంతాలు వేరైనా అన్ని చోట్ల పిల్లలు ఆడుకునే ఆటలు ఒకటే. ఆటల పేర్లు మరో విధంగా ఉండవచ్చు. కానీ ఆడే విధానం ఒక్కటే. అందుకనే రచయిత పిల్లల ఆటలకు సంబంధించిన అనేక రకాలైన ఆటలను బాగా పరిశీలించి అవి ఎలా ఆడుకోవాలి? వాటి పేరు..? మొదలగు ప్రాంత మాండలికం వాడటం వల్ల చదవటం కొంచెం కష్టం అవుతుంది. ఒకటి, రెండు సార్లు చదివితే ..ఆట మనకు తెలుస్తుంది.

ఆటాడుకుందాం..రా!
రచయిత: అగరం వసంత్
వెల: 150/-
పేజీలు:: 221/-
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు......

కారణం అవే ఆటలను మన పిల్లలు మరో పేరుతో ఇక్కడ ఆడుకొనటమే. మనం ఆడే వామన గుంట ఆటను వారు వాన గుంతలాటగా ఆడుతారు. అలాగే బిళ్ళకోడి ఆటను జల్లి కట్టె అని చెమ్మ చెక్క ఆటను చప్పాళ్ళు అని జారుడు బండాటను జారీ బండాట అని, కళ్ళకు గంతల ఆటను కణ్ణాముచ్చాలు- కండ్లకి బట్ట ఆట, తాడు ఆటను-ఈడ్పులాట, రాయి-మట్టి ఆటను-ముట్టే ఆట, దాక్కొనే ఆటను-కణ్ణాముచ్చాలు ఇంకా ఆడపిల్లలు ఆడుకునే ఆటలు కుందుడుకుమ్మ ఆటను కుంటే బిళ్ళ ఆట అంటారు. ఇలా కుందుడు కుమ్మలో ఎన్నో రకాల ఆటలను వాళ్ళ మాండలికంలో జూరాటా, కిష్ణ కాలు ఆట, గుర్రం కాలు ఆట, అమిటి ఆట, ఇండ్ల కుంట ఆట, పదిండ్ల ఆట, మగ పిల్లలు ఆటలు గోళీల ఆటలను మూడు బొద్దిలాట, గుండాట, సయ్యి గుయ్యి ఆట, సోణికి ఆట వంటి పేర్లతో హోసూరు ప్రాంతంలో ఆడతారు. ప్రాంతం వేరైనా భాష వేరైనా అక్కడి వారైనా ఇక్కడి వారైనా అడేది ఒక్కటే ఆట. అందుకే రచయిత ఎప్పుడో చిన్నప్పుడు తాను ఆడిన ఆటలను బాగా గుర్తు పెట్టుకొని ఈనాడు అసలు ఆటలే ఆడని ఆడటానికి అవకాశం లేని పిల్లలకు అనాటి ఆటలను పరిచయం చేయటం ఈ పుస్తక ఉద్దేశం. పిల్లలలో ఆటల ఆవశ్యకతను తెలియజేసారు రచయిత. హోసూరు మాండలికంలో వచ్చిన ఈ ఆటల కథల పుస్తకం మనల్ని మన చిన్న తనానికి తీసుకుపోతుంది అనటంల్లో సందేహం లేదు.

- విష్ణుభొట్ల రామకృష్ణ

గ్రిమ్మీ

ప్రాణం తీసేంత అభిమానం!

పాప్ సంగీత ప్రపంచంలో అభిమానం హద్దులు దాటి ఆరాధ్య తారల ప్రాణాల్ని బలిగొంటోంది. కొన్ని రోజుల క్రితం ఓర్లాండో కాన్సెర్ట్‌లో క్రిస్టినా గ్రిమ్మీ హత్య పాశ్చాత్య పాప్ ప్రపంచపు పిచ్చి అభిమానాన్ని ప్రపంచానికి చూపింది. ఈ హత్య ఇదొక్కటే కాదు.

క్రిస్టినా గ్రిమ్మీ అప్పుడే అభిమానుల్ని ఉర్రూతలూగించే ప్రదర్శన ఇచ్చింది. ఆమె కంటి చూపు కోసం కుస్తీలు పడుతున్న వీరాభిమానులను దగ్గరకు పిలిపించుకుంది. అందులో ఓ అభిమాని కాస్త కంగారుగా ఉంటే ప్రాణ స్నేహితురాలిగా రెండు చేతులు చాచి దగ్గరకు తీసుకోబోయింది. ఒక్క అడుగు పడిందో లేదో గన్ పేలిన శబ్దం. వరసగా మూడు గన్ షాట్లు. క్రిస్టినా రక్తం మడుగులో.. క్రిస్టినా అన్న మార్కస్ ఆ ఉన్మాదిని నియంత్రించే లోగా అతడు తనను తాను కాల్చుకున్నాడు. రెండేళ్ల క్రితం 'ది వాయిస్' సంగీత కార్యక్రమం ద్వారా సంచలనం సృష్టించింది 22 ఏళ్ల క్రిస్టినా. పాప్ ప్రపంచంలోకి అడుగిడి అభిమానుల్ని రాక్ చేసేసింది. కెవిన్ జేమ్స్ లోయ్బిల్ అనే అభిమాని క్రిస్టినాను పిచ్చిగా ప్రేమించాడు. ఇంట్లోనే కాదు పనిలో ఉన్నా కూడా ఆమె పాటలే పదేపదే వినేవాడు. వివాహం చేసుకోవాలనే కోరికతో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, లాసిక్ కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్నాడు. పూర్తి శాకాహారిగా మారిపోయి బరువు తగ్గించు కున్నాడు. కొన్ని నెలల క్రితం ఓ కాన్సెర్ట్‌లో ఆమెను కలిసే ప్రయత్నం చేశాడు. కానీ వీలు కుదరలేదు. ఇంతలో ఆమెకు ఓ బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని అతణ్నే పెళ్లి చేసుకోబోతోందనే విషయం తెలిసింది. తనకు దక్కదనుకున్నాడో ఏమో ఓర్లాండో కాన్సెర్ట్‌లో ఆమెను చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు.

బీటిల్స్ బీట్ ఆగింది

జాన్ లెనన్ పాశ్చాత్య సంగీత ప్రపంచంలో పరిచయం అక్కరలేని లెజెండ్. బీటిల్స్ బ్యాండ్ సృష్టికర్తల్లో ఒకరు. 1980 డిసెంబర్ 8న న్యూయార్క్‌లోని రికార్డ్ ప్లాంట్ స్టుడియో నుంచి భార్య యోకో ఒనోతో కలసి ఆయన ఇంటికి వస్తుండగా ఓ వెర్రి అభిమాని మార్క్ డేవిడ్ చాప్‌మెన్ ఎదురుపడి గన్‌తో కాల్పులు జరిపాడు. నాలుగు తూటాలు జాన్ లెనన్ దేహంలోకి దూసుకుపోయాయి. రూజ్‌వెల్ట్ ఆస్పత్రికి చేర్చేలోగానే ఆయన చనిపోయాడు. హవాయిలోని హొనొలూలూకు చెందిన డేవిడ్ చాప్‌మెన్ అక్కడ నుంచి వచ్చి ఆ రోజంతా కూడా జాన్ లెనన్ ఎక్కడికెళితే అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ఓ ఆల్బమ్‌పై ఆటోగ్రాఫ్ కూడా తీసుకున్నాడు.

మర్డర్ ఆఫ్ సెలెనా

ఒకప్పటి పాప్ స్టార్ సెలెనా క్వింటానిల్లా పెరెజ్ అనే అమెరికన్ సింగర్ కూడా 24 ఏళ్లకే అభిమాని తూటాలకు బలైంది. యోలాండా సాల్డివార్ అనే అమ్మాయి సెలెనా ఫ్యాన్ క్లబ్‌కు అధ్యక్షురాలు. ఆ తర్వాత సెలెనా మేనేజర్‌గా కూడా పనిచేసింది. ఓ వ్యవహారంలో గొడవ జరిగి ఆమె తుపాకీతో సెలెనాను హతమార్చింది.

జపాన్‌లోను

తానిచ్చిన బహుమతిని వెనక్కిచ్చేసిందన్న ఒకే ఒక కారణంతో జపాన్ పాప్ సింగర్ మాయు టోమిటాను కొన్ని రోజుల క్రితం 20 కత్తి పోట్లు పొడిచాడో ఉన్మాద అభిమాని. తోమోహిరా ఇవజాకి అనే ఆ కుర్రాడు ఆమెను గాఢంగా ప్రేమించాడు. ఆ సందేశాన్నిస్తూ ఓ గిఫ్ట్ పంపితే మాయు తిరస్కరించింది. రెండేళ్ల క్రితం ఏకేబీ48 బ్యాండ్‌లో ఇద్దరు కళాకారిణులపై ఓ అభిమాని దాడి చేశాడు.



జాన్ లెనన్

స్టాకర్ల భయాలు

పాప్ సెలబ్రెటీలకు ఆందోళన కలిగించే మరో విషయం స్టాకర్లు. ఈ స్టాకర్ల బెడద పాప్ స్టార్ బియాన్స్‌ను వణికించింది. బాస్సీ ఎస్సేన్ అనే అభిమాని 'బియాన్స్‌ను ఆమె రూపంలో ఉన్న మరో వ్యక్తి చంపేసి ఆమె జీవితాన్ని గడిపేస్తోందని' భ్రమించాడు. 2009లో బియాన్స్ ఇంటికి ఈ విధంగా ఉత్తరాలు రాసేసి హతమారుస్తానని హెచ్చరించాడు. 2002లో బ్రిట్నీ స్పియర్స్ వెంట పడ్డాడో వెర్రి అభిమాని మసాహికో షిజావా. నేను నిన్ను వెంటాడుతా (ఐయామ్ చేజింగ్ యూ) అంటూ ఆమె ఇల్లే కాదు తల్లిదండ్రుల ఇళ్లలోకి కూడా చొరబడే ప్రయత్నాలు చేశాడు. మరో పాప్ సంచలనం మైలీ సైరస్‌ను వేధించాడు వీరాభిమాని జేసన్ లూయిస్ రివేరా. మైలీ సైరస్ తన భార్య అని ప్రచారం చేశాడు. ఆమె వాటిని తిప్పి కొట్టడంతో ఓ రోజు కత్తెర తీసుకుని ఆమె ఇంట్లో చొరబడే ప్రయత్నం చేశాడు. సెలెనా గోమెజ్‌కు ఈ చిక్కులు తప్పలేదు. అయితే ఆమె అభిమానే తనను నియంత్రించాల్సిందిగా స్వయంగా కోరుకున్నాడు. ఇక మడోన్నా విషయానికి వస్తే ఆమెను పిచ్చిగా ఆరాధించిన రాబెర్ట్ డ్యూవీ హాస్కిన్స్ అనే అభి మాని వీలుంటే మడోన్నాను పెళ్లి చేసుకుం టాను లేకుంటే ఆమెను దారుణంగా హతమారుస్తాన ంటూ మిత్రులతో అనేవాడు. జస్టిన్ బీబర్, జాస్ స్టోన్‌లను హతమార్చేందుకు ప్రయత్నించిన అభి మానుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు

– జే

ఓ గ్రామీణ పంజాబీ కుర్రాడికి ఉండే మొదటి పిచ్చి పంజాబీ పాప్ ఆల్బమ్స్. దిల్జిత్ దొశాంజ్ కూడా అలానే ఆడుతూ పాడుతూ గ్రామంలో తిరిగాడు. ఇంటర్ చదువుతో లూథియానా నగర జీవితంలోకి ఎంటరయ్యాడు. అదే అతణ్ని ఓ మ్యూజిక్ ట్రూప్‌లోకి లాక్కెళ్లింది. సొంత ఆల్బమ్ చేసే చాన్స్ ఇచ్చింది. తొలి ఆల్బమ్ ఫ్లాప్ అయినా కసిగా గొంతు సవరించుకున్నాడు. కొన్ని ఆల్బమ్స్‌తోనే తనలాంటి పంజాబీ యువకుల దిల్ గెలిచాడు దిల్జిత్. చివరకు ఓ పాప్‌స్టార్‌గానే కాక ఓ మంచి నటుడిగానూ కెరీర్ మలుపు తిరిగింది. 'ఉడ్తా పంజాబ్'తో ఆయన బాలీవుడ్ కెరీర్ కూడా చాలా ఎత్తుకు ఎగిరింది.

- కొప్పుశెట్టి దేవరాజు

దిల్ గెలిచాడు

దిల్జిత్ దొశాంజ్ పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ జిల్లాలోని దొశాంజ్ కలన్ అనే మారుమూల గ్రామంలో 1984 జనవరి 6న జన్మించాడు.

- అతని బాల్యమంతా ఆ గ్రామంలోనే గడిచిపోయింది. ఇంటర్మీడియేట్ లూథియానాలో చేశాడు. అప్పుడే గాయకుడు కావాలనే లక్ష్యం ఏర్పడింది.
- అప్పటి నుంచే స్థానికంగా ఉండే సిక్ మ్యూజిక్ ట్రూప్‌లో గాయకుడుగా కెరీర్‌ను ప్రారంభించాడు. మొదటిసారిగా ఆయన 'ఇష్క్ ద ఉడ్ అద' అనే మ్యూజిక్ ఆల్బమ్‌ను 2004లో విడుదల చేశాడు.
- టి సిరీస్ సంస్థ ఫైన్‌టోన్ క్యాసెట్స్ ద్వారా తొలి గీతాలు మార్కెట్‌లోకి విడుదలయ్యాయి. అదే ఏడాది దిల్ పేరిట మరో ఆల్బమ్‌ను విడుదల చేశాడు. ఈ రెండు ఆల్బమ్స్ కూడా సంగీత ప్రియులను ఆకట్టుకోలేకపోయాయి.
- ఎలాగైనా తన గొంతుతో శ్రోతలను అలరించాలని పట్టుదలతో 2005లో 'స్మయిల్' పేరుతో మరో ఆల్బమ్‌ను చేశాడు. దీన్ని కూడా టి సిరీస్ సంస్థే మార్కెట్‌లోకి విడుదల చేసింది. దొశాంజ్ కసితో చేసిన ఈ ఆల్బమ్ సంచలనాలు సృష్టించింది. పంజాబీ కుర్రకారుని ఉర్రూతలూగించిన ఈ ఆల్బమ్ క్యాసెట్లు లక్షల్లో అమ్ముడు పోయాయి.
- ఆయనకు వచ్చిన పాపులారిటీ సినీ అవకాశాల్ని కూడా కలిగించింది. మొదటి సారిగా 2011లో నటుడిగా అడుగుపెట్టాడు.
- మొదటిసారిగా ఆయన హీరోగా 'లయిన్ ఆఫ్ పంజాబ్' చిత్రంలో చేశాడు. తెలుగులో 2003లో రవితేజ హీరోగా చేసిన 'వీడే' చిత్రాన్ని పంజాబీలో రీమేక్ చేశారు. ఇది 2011 జనవరి 31న విడుదలైంది. మొదటి సినిమాయే బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది.
- సినిమా ఫ్లాప్ అయినా ఆ చిత్రంలోని 'లక్ 28 కుది ద' చేసిన పాట మంచి పేరు తెచ్చి పెట్టింది. యూకే అధికారిక ఆసియా డౌన్‌లోడ్ చార్ట్‌లో నెం.1గా ఆ ట్రాక్ నిలిచిందని బిబిసి ప్రచురించింది.
- అదే ఏడాది గిప్పి గ్రేవాల్, దొశాంజ్ కలిసి మల్టీస్టారర్‌గా చేసిన రెండో చిత్రం 'జినే మేరా దిల్ లుతెయ' జూలై 29న విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించింది.
- టీనేజీ అమ్మాయిల టాట్టూ, డ్రగ్స్ పిచ్చిపై చేసిన 'అర్బన్ పెండూ'పై విమర్శలు రావడంతో ఆ ఆల్బమ్‌ను ఆపేశాడు.
- పంజాబీ చిత్రాల్లో వరస అవకాశాలు వచ్చాయి. 2012లో జాట్ & జూలియెట్, 2013లో దానికి సీక్వెల్‌గా వచ్చిన జాట్ & జూలియెట్-2, పంజాబ్ 1984, 2015లో విడుదలైన సర్దార్ జీ చిత్రాలు విజయం సాధించాయి.
- ఈయన 11 మ్యూజిక్ ఆల్బమ్స్‌ను చేశాడు. మూడు పంజాబీ, ఐదు హిందీ సినిమాల్లో ఆయన గీతాలు ఆలపించాడు. 2011 నుంచి నటుడిగా కెరీర్‌ను ప్రారంభించి ఇప్పటి వరకూ హీరోగా, సహాయ నటుడుగా హిందీ, పంజాబీ భాషల్లో మొత్తం 12 సినిమాల్లో నటించాడు.
- ఆయన చేసిన రెండో సినిమా 'జినే మేరా దిల్ లుతెయా'లో నటనకు ఉత్తమ నటుడుగా పంజాబీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ అకాడెమీ అవార్డు, పి.టి.సి పంజాబీ ఫిల్మ్ అవార్డులు లభించాయి. ఇప్పటి వరకు నాలుగు సార్లు ఉత్తమ నటుడుగా అవార్డులు వరించాయి.
- హిందీ సినిమాలు తేరే నాల్ లవ్ హో గయా, మేరే డాడ్ కి మారుతి, యమ్లా పగల దీవాన-2, సింగ్ ఈజ్ బ్లింగ్ చిత్రాల్లో దొశాంజ్ పాడారు.
- ఇటీవల మాదకద్రవ్యాలపై రూపొందిన చిత్రం 'ఉడ్తా పంజాబ్' ద్వారా బాలీవుడ్‌లో అడుగు పెట్టాడు. ఈ చిత్రంలో పోలీస్‌గా చేశాడు.

✦

కాగితం నా దేహం

అక్షరాల వ్యామోహంతో
పరితపించే కాగితం నా దేహం
పచ్చని మొక్కలు నాటినట్టు
నా దేహంపై కవిత్వాక్షరాలు
లిఖించండి

సముద్రానికి నడక నేర్పే అలల్లా
భూమికి ఊపిరినిచ్చే వర్షంలా
ఆకాశంలో కాంతిని నింపే నక్షత్రాల్లా
గర్జించే ఉరుముల్లా
రగిలించే మెరుపుల్లా
కదిలే మేఘాల్లా
కవిత్వాక్షరాలు నాదేహంపై
కదం తొక్కాలి.

పిడికిళ్లు బిగించినట్టు
పేదలు వారికి దక్కాల్సిన భూముల్లో
ఎర్ర జెండాలు పాతినట్టు
ఎర్రని మందారాల్లా నా దేహంపై
కవిత్వాక్షరాలను పూయించండి.

సముద్ర గర్భంలో సునామీలు
పుట్టుకొచ్చినట్టు
ప్రకంపనాలతో భూమి బద్దలైనట్టు
ఆకలి కడుపులు మండి మండి
దోపిడి శక్తుల దౌర్జన్యాన్ని చీల్చినట్టు
కవిత్వాక్షరాలు పదునెక్కాలి.

పోటెత్తే అక్షరాలతో నాదేహాన్ని
ఆయుధంగా మలచండి
కాగితం నా దేహం
అక్షరమే నా పతాకం

- పొనుగుమట్ల అశోక్ కుమార్
9959379709



కవిత్వము

పూ(మా)ల పిల్ల

రోజూ ఆఫీసుకు సిటీ బస్సులోనే
వెళ్ళి వస్తుంటాను
ఉదయం సాయంత్రం బస్ షెల్టర్
దగ్గర
పూలపిల్లను చూస్తూనే
వుంటాను...

బుట్టమీద
ప్రతి సీజన్‌లో దొరికే పూలు
ప్రత్యక్షమవుతుంటాయి
కొన్ని పూలతో ఆ పిల్ల కళ్ళు
పోటీ పడుతుంటాయి

ఆ సువాసనల పోకళ్ళు
భేటీ అవుతుంటాయి...
ఒక్కోసారి ఆ అమ్మాయి
పెట్టుకున్న పూలచెండు
పట్టుకున్న పూల మాల
కట్టుకున్న పూల లంగా
చూస్తుంటే
వనదేవతలా అ(క)నిపిస్తుంది...

ఉదయం బస్ వచ్చేంతవరకూ
ఆ పూల పరిమళాన్ని ఆఘ్రాణిస్తూ
ఆఫీసుకు మోసుకెళుతుంటా
సాయంత్రం బస్ దిగాక
ఆ సుగంధ సుమాల్ని కొనుక్కొని
ఇంటికి తీసుకుపోతుంటా...

ఇరవయ్యేళ్ళయినా
పూల పిల్ల 'బొమ్మ'ను
చూసినపుడల్లా
'కరుణశ్రీ' గుర్తొస్తాడు
ఆ పిల్ల 'బొరుసు' స్థాయి
మారనందుకు
'శ్రీ శ్రీ' ఆవహిస్తుంటాడు...

ఎవరో అన్నారు
ఆ పూలపిల్ల 'మాలపిల్ల' అని
నా దృష్టిలో మాత్రం
ఆ పూ(మా)ల పిల్లే "గోదాదేవి"

- బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి
9885481939

ప్రయాణం

- డా॥ డి.వి.జి. శంకర రావు
9440836931

ఇరవై సంవత్సరాల తర్వాత మా ఊరి వైపు ప్రయాణం సాగిస్తున్నాను. ఉద్వేగాన్ని మించి నాలో ఉత్సుకత ఎక్కువ పాళ్ళలో ఉంది. ఈ ప్రయాణమైనా ముందుగా ప్లాన్ చేసుకున్నది కాదు. అమెరికా నుండి వస్తూ కూడా ఈ ఊహే మనసులో లేదు.

నేను అమెరికాలో కార్డియాలజిస్టుని పీజీ డిగ్రీ విశాఖపట్నంలో పూర్తి చేసుకొన్నాక వెంటనే అమెరికాకి ఎగిరిపోయే ఛాన్సు రావడంతో అదృష్టం పాత్ర ఉన్నా నా కృషి కూడా తక్కువదేం కాదు. ఐనా చిన్నప్పటి నుంచి నన్ను అదృష్టవంతుడవనే వాళ్ళే ఎక్కువ. అది నిజమేనేమో! లేకుంటే దేశం కాని దేశంలో మంచి డాక్టరుగా బిజీగా ఉండగలగడం మాటలా! అంత బిజీలో కూడా వీలు చూసుకొని వైజాగ్ రావడానికి ముఖ్య కారణం " అంతర్జాతీయ హృద్రోగ నిపుణుల సదస్సు" లో పాల్గొనాల్సి రావడమే. సదస్సులో నేనొక కీలక ఉపన్యాసకుణ్ణి వస్తూనే వైజాగ్ డాల్ఫిన్ హోటల్‌లో దిగాం. దేశం నలుమూలల నుండి కార్డియాలజిస్టులెందరో వచ్చారు. వాళ్ళతో పరిచయాలు, పలకరింపులు, వృత్తి సంబంధ సమాచారం ఇచ్చి పుచ్చుకోవడాలతో మొదటి రోజు సమయం తెలియకుండానే గడిచిపోయింది.ఎంతగానంటే ఊళ్లోనే ఉన్న నేను చదువుకున్న కాలేజీని కూడా వెళ్ళి చూసొద్దామన్న ధ్యాసే రానంతగా. ఇరవై యేళ్ళ క్రితం గడిపిన జీవితానికి సాక్ష్యంగా నిల్చినా క్యాంపస్ గురించి ఆలోచనే రానతంగా.

రెండో రోజు ఉదయాన్నే నా రూమ్‌లో ఇంటర్‌కమ్ ఫోన్ మోగింది. రిసెప్షనిస్టు చెప్పారు. "సర్ మీకోసం ఓ విజిటర్ వచ్చారు. రూమ్‌కి పంపొచ్చా? లాబీలో వెయిట్ చెయ్యమని చెప్పాలా? పేరడిగాను తను చెప్పినా నాకు ఎవరన్నది స్ఫురించలేదు" అని చెప్పాడు. వెంటనే రూమ్‌కి పంపమన్నాను. సదస్సుకి వెళ్ళేముందు ఈ డిస్టర్బెన్స్‌లేమిటి అని విసుక్కొంటూనే.

వాడిని చూడగానే వెంటనే గుర్తుపట్టలేకపోయాను. మనిషి సన్నగా ఉన్నా నా కంటే పెద్దవాడిలా కనిపిస్తున్నాడు. వాడి గెటప్ చూస్తే "వీడి వృత్తి రాజకీయాలంటూ ఠక్కున చెప్పేయవచ్చు. వాడి పేరు నీలకంఠం. స్కూల్‌లో క్లాస్‌మేట్. ఇద్దరం ఒకే ఊరివాళ్ళం కూడా. వైజాగ్‌కి 130కిలోమీటర్ల దూరంలో నున్న గుమ్మలక్ష్మీపురం మా ఊరు. వాడిని చూసి 30 సంవత్సరాలు దాటే ఉంటుంది. గుర్తుపట్టగానే నేనే ఆనందంగా అరిచాను.

"ఓరేయ్ నీలకంఠం నువ్వేనా? ఎంత హ్యాపీగా ఉందిరా నిన్ను చూడడం?

రిసెప్షనిస్టు నీలకంఠం నాయడో, రాయుడో సమ్‌థింగ్ చెప్పేసరికి కన్ఫ్యూజ్ అయ్యానురా. ఒట్టి నీలకంఠం ఫ్రం గుమ్మలక్ష్మీపురం అంటే ఎప్పుడో తెలిసేది. క్షణ కాలం పట్టేది కాదు. అయినా నా పేరులో ఆ తోక ముందు లేదు గదా!"

"సంతోషం గణపతీ! మరుక్షణమే గుర్తుపట్టినందుకు ఎవరో న్యూమరాలజిస్ట్ కలుస్తారని చెబితే ఆ తోక తగిలించాను" మొహమాటంగా చెప్పాడు.

కారణం అది అయ్యుండదనిపించింది. అయినా అది అప్రమత్తం.

ఏమిటి విశేషాలు? మన ఊరు ఎలా ఉంది? చూసి ఇరవై యేళ్ళు దాటింది. అంతా బాగుంది.

మన ఊరి అబ్బాయి ఒకడు వైజాగ్‌లోనే మెడిసన్‌లో పీజీ చేస్తున్నాడు. ఆయన ద్వారానే మీ - కాన్ఫరెన్సు గురించి, నువ్వొస్తున్న సంగతి తెలిసింది. మన ఊరివాళ్ళ కోరిక మీదే ఇక్కడికొచ్చాను.

" చాలా సంతోషం. నేనేం చెయ్యగలను?"

"ఏమీ చెయ్యనక్కరలేదు గణపతీ! పనిలో పనిగా కొంచెం వీలు చూసుకొని ఒక్క పూట వస్తే నిన్ను సన్మానం చేయాలని మా అందరి కోరిక ప్లీజ్. కాదనకు."

నిర్ఘాంతపోయాను. ఊరు చూడాలని కోరికే నాకు కలగలేదు. టైమ్ కూడా లేదు. సదస్సు ముగిశాక రెండ్రోజులే ఇక్కడ ఉండేది. ఆ విషయమే చెప్పాను.

ఒక్కరోజు కేటాయిస్తే చాలన్నాడు. బలవంతంగా సరే అన్నాను.

ఆ ఫలితమే ఈ రోజు నా ప్రయాణం

వెళ్తున్నాను గానీ నాకు అర్థంకాని విషయాలు రెండు. ఒకటి-నీలకంఠం ప్రజాసేవకుడవ్వడం? వాడికి సేవాభావం గానీ, చదువుగానీ, సంస్కారంగానీ నాకు తెలిసీ ఏ కోశానా లేవు. నేను ఎమ్.బి,బిఎస్.చదువుతున్నప్పుడనుకొంటాను. ఓ

రోజు మా కళ్ళముందే ఓ యాక్సిడెంట్ అయ్యి ఓ యువకుడు ప్రాణాపాయస్థితిలలో హాస్పిటల్‌లో చేరాడు. ఆరోజు యథాలాపంగా నీలకంఠం కూడా నాతోనే ఉన్నాడు. ఆ యువకుడికి బి పాజిటివ్ రక్తం అవసరమైంది. నీలకంఠానిది అదే గ్రూపు రక్తం.

"రక్తదానం చెయ్యరా, ప్రాణం నిలపరా నీకేం కాదు" అంటూ ఎంత ప్రాధేయపడ్డానో! ససేమిరా అంటూ వెంటనే ఉడాయించాడు. ఆ రోజు అదృష్టవశాత్తు మా క్లాస్‌మేట్ అమ్మాయిలిద్దరు రక్తదానం చేసి ఆ యువకుడి ప్రాణాలు కాపాడారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. ఇందుకు విరుద్ధమైన ఉదాహరణ దృష్టాంతాలు వాడి విషయంలో ఒక్కటంటే ఒక్కటి లేవు.

ఇక రెండో విషయం. ఊరు నాకు సన్మానం తలపెట్టడం. నీలకంఠానికి నాకు ఒకటే ప్రస్ఫుటమైన తేడా. చదువు అంతకు మించి ఊరికి నేను చేసిందేమీ లేదు. ఈ ఇరవైయేళ్ళలో కనీసం ఒక రోజైనా దాని గురించి ఆలోచించింది లేదు. నా బతుకు నేను బతుకుతున్నాను.అంతో ఇంతో ఉంటే ఊరికి నా మీద కోపం ఉండి ఉండాలి. ఎందుకంటే మా నాన్న మరణించినప్పుడు నేనిక్కడికి రాలేకపోయాను. ఆ రోజు మరణవార్త ఫోన్లో తెలియజేసిన గ్రామపెద్దతో కర్కశంగా చెప్పాను. " మావయ్యా! ఇక్కడ తలకు మించిన పనులతో బిజీగా ఉన్నాను. రావడం కుదరదు. వీలు చూసుకొని వస్తాను. నాన్నని నాతో రమ్మంటే నేను ఊర్లోనే బతికాను. ఇక్కడే చస్తాను" అంటూ మొండిగా ఉండిపోయారు. ఏదో రోజు ఇలా జరగాల్సిందే. ఏం చేస్తాం. ప్రాక్టికల్‌గా ఆలోచించాలి గదా! కార్యక్రమాలు ఘనంగా జరిపించండి. ఖర్చులన్నీ భరిస్తాను.

"నాయనా ! గణపతి! తెలియజేయాల్సిన బాధ్యత కొద్ది తెలియజేశాం. మీ నాన్నగారు అందరికీ తలలో నాలుక. ఆయనకి తుది వీడ్కోలు ఘనంగా ఇచ్చుకోలేని దౌర్భాగ్య స్థితి ఇంకా ఊరికి పట్టలేదు. నువ్వు నిశ్చితంగా ఉండు అంటూ ఫోన్ పెట్టేశాడు.

మాట వరసకి అన్నానే కానీ ఇంతవరకు ఊరి మొహం చూడలేకపోయాను. ఇది జరిగి 15 సంవత్సరాలైంది. అందుకు గిల్టీగా ఫీల్ అయ్యింది కూడా లేదు. ఇది నిజం అలాంటిది నాకు సన్మానమా!? ఆలోచనలు పరిపరి విధాలుగా సాగుతుండగానే ఊరి పొలిమేరల్లోకి వచ్చాం.

టాక్సీడ్రైవర్ మధ్యమధ్యలో ఏదో మాట్లాడుతున్నా పట్టించుకునే స్థితిలో లేను. గుమ్మలక్ష్మీపురం అన్న బోర్డు కనపడగానే ఒక్క నిమిషం గుండె లయ తప్పింది. అటూ, ఇటూ చూస్తే ఊర్లో పెద్దగా మార్పులేదు. ఊరి బయటనే రియల్ ఎస్టేట్ లే అవుట్లు తప్ప గతుకుల రోడ్డు, డ్రైయినేజీలో పూడిక తీత లేక రోడ్డుపైకి వచ్చేస్తున్న మురుగు.

కొంచెం ముందుకు వెళ్ళగానే నా సన్మానానికి సంబంధించిన ఫ్లెక్సీ బోర్డు కనబడింది. ఒక్క నిమిషం ట్యాక్సీని ఆగమని చెప్పి చదివాను. ఇలా ఉంది

"అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతిగాంచిన ఈ ఊరి బిడ్డ డా॥ గణపతికి ప్రేమతో సన్మానం" ఆనందంగా చదువుతున్న నాకు ఆకరి వాక్యం చదివే సరికి గొంతులో వెలక్కాయపడింది.

" సన్మానం చేస్తున్నవారు. పలానా కుల సంఘం"

ప్రయాణానికి విరామమిస్తూ వెనక్కి తిరిగాను.

ఔను మరి దారి తెలిస్తే మాత్రం చాలునా. సరైన తీరులో రావొద్దూ!?

✦

రాజధాని

- జి.యస్. కె. కరిముల్లా
సెం:9966757407

గుంటూరు బస్టాండులో బస్సుకోసం నిల్చున్నాను. బస్సు రాకపోవడంతో ప్లాట్‌ఫాం పై ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను.

దూరంగా ఓ ముసలి లైసెన్సు కూలీ నెత్తిన పెద్ద బరువులు మోసుకుంటూ రావడం కన్పించింది. సేద తీరాల్సిన వయసులో అతను ఇంకా కష్టాల బరువులు మోయాల్సి రావడం చూసి బాధేసింది. అతణ్ణి చూడగానే నాకెందుకో బాగా పరిచయం ఉన్న వ్యక్తిలా అనిపించాడు. పరిశీలనగా చూశాను. ఏదో బస్సు అడ్డు వచ్చింది. అతను ఎటో వెళ్ళిపోయాడు.

అతణ్ణి ఎక్కడో బాగా చూసినట్లుగా అన్పిస్తోంది. ఓ పట్టాన గుర్తుకు రావడం లేదు.బుర్రకు పదును పెట్టాను. చాలా సేపటి తర్వాత గుర్తుకొచ్చాడు రాఘవయ్య... అవును! అతను రాఘవయ్యే మరైతే ఊళ్ళో వ్యవసాయం చేసుకోవాల్సిన వ్యక్తి ఇలా బస్టాండ్‌లో బరువులు మోయడమేమిటి? నేను భ్రాంతికి లోనవ్వలేదు కదా! భ్రాంతి కాదు. అతను నిస్సందేహంగా రాఘవయ్యే అని మనసు చెప్తోంది.

కుర్చీలోంచి లేచి అతని కోసం అటు ఇటు వెతికాను. కన్పించలేదు. మళ్ళీ కుర్చీలో కూర్చున్నాను. బస్సింకా రాలేదు. ఏవో ఆలోచన్లు ముసురుకున్నాయి.

సరిగ్గా పదేళ్ళకిందటి మాట....

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రాజధాని ప్రాంతంలో టీచర్‌గా ఉద్యోగం చేస్తున్న రోజులు. నేనక్కడే ఉండేవాణ్ణి. నేనక్కడ పనిచేస్తున్నప్పుడు నాకు రాఘవయ్య పరిచయం. స్కూలు పక్కనే అతని ఇల్లు. రాఘవయ్య చిన్నసన్నకారు రైతు. వ్యవసాయమంటే రాఘవయ్యకు ప్రాణం.

తూర్పున వెలుగు రేకలు విచ్చుకోక ముందే తన సేద్యం మొదలయ్యేది. వేకువ ఝామునే పొలానికి వెళ్ళేవాడు. నీళ్ళు పెట్టేవాడు. పొలమంతా కలియ తిరుగుతూ కలుపుపీకేవాడు. అదుగో అప్పుడు వంచిన నడుము మళ్ళీ ఎత్తేది సూర్యుడు నడినెత్తి మీదికొచ్చినప్పుడే! తిండి తిప్పలు అన్ని అక్కడే. గట్టున కూర్చుని ఓ ముద్దతిని చెట్టుకింద కాసేపు విశ్రమించేవాడు. అంతలోనే ఎవరో లేపినట్టు చటుక్కున లేచి పొలంలోకి దిగేవాడు.

ఇక ఇంటికి చేరేది సాయంత్రం చీకటి పడ్డాకే. పడుకున్నా రాఘవయ్య మనసంతా పొలం మీదే ఉండేది. చేనుకు తడి పెట్టాలని అర్థరాత్రో అపరాత్రో

లేచిపోయేవాడు. ఇంటి దగ్గర ఒక్క క్షణం ఉండేవాడు కాదు.

అలా రాఘవయ్యజీవితం సేద్యంతో పెనవేసుకుపోయింది.అతని అణువణువు మట్టితో నిండిపోయింది. ఇప్పట్లా వ్యవసాయాన్ని కృత్రిమ ఎరువులతో కాకుండా సంప్రదాయబద్ధంగా సేంద్రియ ఎరువులతో చేసేవాడు. అందరికన్నా పదిరెట్లు ఎక్కువే పండించేవాడు.

సెలవు రోజుల్లో నేను రాఘవయ్యతో పాటు పొలానికి వెళ్ళేవాణ్ణి. సేద్యానికి సంబంధించి ఎన్నో విషయాలు నాతో చెప్పేవాడు. దుక్కిదున్ని విత్తునాటిన దగ్గర్నుంచి ఏ తెగులుకు ఏ విరుగుడు వాడాలి? చీడ పీడల్ని ఎలా వదిలించాలి? కోత ఎప్పుడు కోయాలి? ఇలా వ్యవసాయం మీద రాఘవయ్యకున్న అవగాహన అపారం. అసలు వ్యవసాయం అధికారులకు తెలీని ఎన్నో విషయాలు రాఘవయ్యకు తెలుసు.

ఇప్పటి వాళ్ళు వ్యవసాయాన్ని ఆషామాషిగా చేస్తూ సరిగ్గా దిగుబడి రావడం లేదని వ్యవసాయం దండగని అంటున్నారు. అది తప్పు అయ్యవారా! అనేవాడు రాఘవయ్య.

"వ్యవసాయం యజ్ఞం లాంటిది. రైతు నేలతల్లికి సేవచేయాలి. అప్పుడే అమ్మ అనుగ్రహం కలిగేది." అని చెప్పేవాడు రాఘవయ్య.

ఈ మాటలు చెబుతున్నప్పుడు రాఘవయ్య పుడమి తల్లి పట్ల వ్యవసాయం పట్ల ఒక అనిర్వచనీయమైన భక్తి భావం కన్పించేది నాకు.

"సేద్యమంటే నీకెందుకు మమకారం" అని ఓ సారి అడిగాను రాఘవయ్యను. ఈ చేతుల్తో పదిమందికి అన్నం పెడుతున్నా రాజు నుంచి పేదవరకు నేను పండించిన అన్నాన్ని తింటున్నారు. అంతకన్నా తృప్తి ఏముంటుంది అయ్యవారా! రైతుకున్న ఈ తృప్తి దేశాన్నేలే రాజుకి కాని, మా రాజులకు గాని దొరుకుతుందా? ఈ జన్మకు రైతుగా పుట్టా, రైతుగానే చస్తా, మళ్లీ పది జన్మలైనా రైతుగానే పుడతా. ఉద్వేగంగా చెప్పేవాడు రాఘవయ్య. అలా చెబుతునప్పుడు రాఘవయ్య ఛాతి రైతునన్న గర్వంతో ఉప్పొంగేది. కృష్ణమ్మ తల్లికూడా పక్కనే ప్రవహిస్తుండటంతో అక్కడి రైతులు ఏడాది పొడవునా మూడుపంటలు పండిచేవారు. ఇప్పుడు రాజధాని పరిధిగా చెప్తున్న ప్రాంతంలో ఏ దిక్కుకు చూసిన చూపు సాగినంత మేర నేలకు పచ్చని రంగులు అద్దినట్టు పచ్చని పొలాలతో కళకళలాడుతూ ఉండేది.

రాఘవయ్యకు ముగ్గురు కూతుళ్ళు. తన రెక్కల కష్టంతోనే వాళ్ళకు పెళ్లిళ్లు చేశాడు. తనకన్నా వీసమెత్తు కలిగిన కుటుంబాలకే వాళ్ళను పంపించాడు.

మా అయ్య నాకు సేద్యం నేర్పించాడు తప్ప పోతూ పోతూ చిన్న మడి చెక్క కూడా ఇవ్వలేదు. నా రెక్కల కష్టంతోనే రెండెకరాలు సంపాదించా. నేలతల్లి చల్లని చూపులతో నా బిడ్డల పెళ్లిళ్లు చేశాను. ఇంగ నాకు దిగులేంది. అయ్యవారా! అయినా మట్టిని నమ్ముకున్నోడు ఎన్నడూ చెడింది లేదు.

అని చెప్పేవాడు రాఘవయ్య

ఆ తర్వాత లాంగ్ స్టాండింగ్‌పై నేనక్కడి నుంచి మరో చోటికి వెళ్లిపోయాను.

బాగున్నావా అయ్యావారా! అన్న మాటలతో ఆలోచనల్లోంచి బైటికొచ్చాను.

ఎదురుగా రాఘవయ్య. ఒకప్పుడు రైతు రాజసంతో కన్పించే రాఘవయ్యను మాసిన గడ్డం చిరిగిన చొక్కాలో చూసి బాదేసింది.

"బాగున్నానని" చెప్పాను. నువ్వెలా ఉన్నావని అడుగుదామనుకుని అతణ్ణలా చూస్తూ అడగలేక పోయాను."రాఘవయ్య ఏంటి ఇలా కూలీగా...' ఆశ్చర్యంగా అడిగాను. రాఘవయ్య గంభీరంగా మారిపోయాడు. ఓ క్షణం నిశ్శబ్దం అలుముకుంది.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ రాజధాని భూతం మా పొలాన్ని మింగి మా బతుకుల్ని బుగ్గి చేసిందయ్యా" గొంతు గాద్గదికం కాగా ఎలాగో పెగల్చుకుని చెప్పాడు. నేను విస్మయానికి గురయ్యాను.

అదేంటి? ఎక్కడైనా రాజధాని వస్తే బతుకులు బాగవ్వాలి గాని బుగ్గవటమేంటి? అన్నాన్నేను.

బాగుపడ్డానికి అవేమన్నా బీడు భూములా? ఏడాది పొడవునా మూడు పంటలు పండే బంగారు భూములు. అట్టాంటి భూముల్లో రాజధాని కడితే భూమిని నమ్ముకున్న రైతేం కావాలి? వాటి మీదే ఆధారపడ్డ వందలాది కూలీల బతుకేం కావాలి?

ఆవేశంగా చెప్పాడు రాఘవయ్య.

నాకు తెలీక అడుగుతా అయ్యవారా? నీకు రెండెకరాల పొలం ఉంది. ఒక ఎకరం బీడు. ఇంకో ఎకరంలో పంట పండుద్ది నువ్వేదైనా కట్టుకోవాలంటే బీడు పొలంలో కట్టుకుంటావా? నీకు అన్నం పెట్టే పొలంలో కట్టుకుంటావా? వేల ఎకరాల బంజరు భూముల్ని వదిలేసి పంటలు పండే భూముల్లో రాజధాని కడతారా? అన్ని వేల ఎకరాల్లో పంటపోతే ఆ మేరకు తిండిగింజలు కరువురాదా? పెద్ద పెద్ద మేడలు పట్టెడన్నంపెడతాయా? అంతస్థులు ఆకలి తీరుస్తాయా? రాఘవయ్య మాటల్లో నిజం ఉందన్పించింది.మరి రైతులంతా సంతోషంగా భూములిచ్చారని ప్రభుత్వం చెప్తుందిగా" అనడిగాను.

ఇచ్చారు కాదనను కాని వాళ్లెవరు ఎన్నడూ వ్యవసాయం చేయనోళ్ళు ఊర్లో పొలాలు కౌలుకిచ్చి హైదరాబాద్‌లోనో బెంగళూరులోనో వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకునేటోళ్ళు. వాళ్ళకి పొలాలు కౌలుకిచ్చినా బకటే ప్రభుత్వానికిచ్చినా ఒక్కటే. మేమట్లాకాదే? మా పరిస్థితేమిటి? అని చెప్పాడు రాఘవయ్య "నువ్వు పొలం ఇవ్వనని ప్రభుత్వానికి చెప్పొచ్చుగా " అనడిగాను

"ఇవ్వనంటే ఊరుకుంటుందా? బెదిరిస్తాది,భయపెడ్తాది. పంటలు తగల బెడుతుంది. రాజ్యం తల్చుకుంటే రైతుల్నుంచి పొలాలు లాక్కోవడం ఓ లెక్కా అయ్యవారా? అని చెప్పాడు రాఘవయ్య.

"పొలాలిచ్చిన రైతులకి ప్రభుత్వం పరిహారం ఇచ్చిందిగా" అన్నాను. ఎవడిక్కావాలి పరిహారం? నేనొకటడుగుతా చెప్పు అయ్యవారా! బడిలో పిల్లలకు చదువు చెప్పడం నీ పని. మరి నువ్వాపని మానేసి గమ్మున కూర్చో నీకు పరిహారం ఇస్తానంటే నువ్వు ఊరుకుంటావా? ఎవడి వృత్తి వాడికి బతుకు. రైతుకు వ్యవసాయమే బతుకు. వృత్తిని వదిలేయడం చావుతో సమానం. అట్టాంటిది పొలాలు లాక్కుని వ్యవసాయం వదిలేయమంటే రైతును చావమనడమే. చంపేసి చావు ఖర్చులియ్యడమే పరిహారం ఇవ్వడమంటే. నేనలాగే చూస్తున్నాను. రాఘవయ్య చెప్తున్నాడు. ఒకప్పుడు భూమికి రైతుకి మాత్రమే సంబంధం ఉండేది. ఇప్పుడు ప్రభుత్వాలు నుంచి పెద్దోళ్ళదాకా అందరికి భూమి కావాలి. భూమి వాళ్ళకు ఓ పెట్టుబడి, వ్యాపారం. అన్నంపెట్టే అమ్మతో ఎవరైనా వ్యాపారం చేస్తారా?

నిర్వేదంగా అన్నాడు. ఈ జన్మకి రైతుగా పుట్టా. రైతుగానే చద్దామనుకున్నా. బతుకాఖరి రోజుల్లో కూలిపని చేయమని దేవుడు నా నొసట్న రాసాడు. ఎవరు తప్పిస్తారు. చచ్చిపోదామనుకున్నా ఇంటి దగ్గర ముసల్ది గుర్తుకొచ్చి ఆగా...

గుండెల్లోంచి ఎగసివస్తున్న దుఃఖాన్ని ఆపడం రాఘవయ్య వల్లకాలేదు. నోటికి గుడ్డను అడ్డుపెట్టుకుని చిన్న పిల్లవాడిలా రోధించాడు.

నా గుండెలు ద్రవించాయి. పల్చని కన్నీటి తెరలు కళ్ళను కప్పేశాయి. రాలిపడుతున్న కన్నీటి చుక్కల్ని కన్పించకుండా కర్చీఫ్‌తో తుడుచుకున్నాను.

క్షణకాలం బస్సుల రణగొణ ధ్వనులు, ప్రయాణీకుల అరుపులు... మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం అలుముకుంది. చాలాసేపటికి గాని మామూలు స్థితికి రాలేదు రాఘవయ్య. కళ్ళుతుడుచుకున్నాడు. కళ్ళ నిప్పుకణాల్లో ఎర్రగా మారాయి. ముఖం రౌద్రంతో నిండిపోయింది.

రైతు భూమిది తల్లి బిడ్డల సంబంధం...రైతు నుంచి భూమిని లాక్కోవడం మంటే తల్లినుంచి బిడ్డను వేరు చేయడమే.

రైతును కొట్టి...పంటను తొక్కి కట్టేదేది సుభిక్షంగా ఉండదు.. అది రాజధానైనా... ఇంకోటైనా.. పైరు పగబడుతుంది అయ్యవారా!..ఆ కసి కోపంతో శాపం పెట్టినట్లు చెప్పి ఎవరో పిలువగా వెళ్ళిపోయాడు రాఘవయ్య. వెళ్తున్న రాఘవయ్యను అలాగే చూస్తుండిపోయాను. మనుష్యుల్లో కలసి అదృశ్యమైపోయాడు రాఘవయ్య.

రాజధాని నిర్మాణం గురించి పేపర్లలో చదివి టి.విల్లో చూసి మురిసిపోయాను. గర్వపడ్డాను ఆ అద్భుత నిర్మాణం మాటున పచ్చని విధ్వంసం జరిగిందని రాఘవయ్యను చూసాక తెలిసింది.బస్సు రావడంతో బరువెక్కిన హృదయంతో కదిలాను.

✦

ఖర్జూరం హల్వా

కావాల్సినపదార్థాలు

ఖర్జూరం-250 గ్రాములు
పాలు-3 కప్పులు
పంచదార-250 గ్రాములు
బాదం పప్పు- 5
జీడిపప్పు-10
కిస్‌మిస్ -4
యాలకుల పొడి - 2 టీ స్పూన్లు
నెయ్యి-3 టీ స్పూన్లు

తయారుచేసే విధానం

ముందుగా స్టౌపై పాన్ పెట్టి కొద్దిగా నెయ్యి వేసి బాదం, జీడిపప్పుని వేయించి పక్కన పెట్టుకోవాలి. ఖర్జూరంలో గింజలను తొలగించి పాలలో వేసి ఉడికించాలి. ఖర్జూరం మెత్తగా అయ్యాక నెయ్యి, పంచదార వేసి కలిపి మూతపెట్టాలి. ఈ మిశ్రమం కొంచెం చిక్కగా మారే వరకూ గరిటతో కలిపి యాలకుల పొడి కూడా వేసి మరికొంత సేపు ఉడకనివ్వాలి. తర్వాత వేయించి పెట్టుకున్న బాదం, జీడిపప్పులతో గార్నిష్ చేసి రుచి చూడండి.

మలాయి చమ్ చమ్

కావాల్సిన పదార్థాలు

పనీర్ తయారీకి

పాలు-6 కప్పులు
వెనిగర్- 1/4 కప్పు
నీరు- 1/4 కప్పు

పాకం తయారీకి

పంచదార- 1 కప్పు
నీరు-4 కప్పులు
ఏలకులు- 2

మలాయ్ కోసం



పాలు-2 కప్పులు
క్రీమ్- 1 కప్పు
పంచదార- 4టేబుల్ స్పూన్లు
రోజ్ వాటర్ - 1 టేబుల్ స్పూన్
పిస్తా, కుంకుమ పువ్వు (గార్నిష్ కోసం)- కొద్దిగా

తయారుచేసే విధానం

ముందుగా ఒక పాత్ర తీసుకుని కొద్దిగా నీరు, ఆరు కప్పుల పాలను పోసి మీడియం మంట పై మరగనివ్వాలి. పాలు పూర్తిగా మరిగిన తర్వాత వెనిగర్, కొద్ది కొద్దిగా నీటిని పోసి పాలను పూర్తిగా మరగనివ్వాలి. ఇలా చేయడం వల్ల పనీర్ ఏర్పడుతుంది. ఇప్పుడు పనీర్ నుండి నీటిని వేరుచేయాలి. ఒక పల్చని గుడ్డలో పనీర్ వేసి గట్టిగా వత్తి పూర్తిగా నీరుని వేరుచేసి 20 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఇప్పుడు ఒక బౌల్‌లో పనీర్ తీసుకుని చపాతీ పిండిలా కలిపి ఓవెల్ ఆకారంలో చిన్న చిన్న ఉండలు చేసి పక్కన పెట్టుకోవాలి.వెడల్పాటి పాత్ర తీసుకుని అందులో 1కప్పు పంచదార, నాలుగు కప్పులు నీరు వేసి స్టౌపై ఉంచాలి. పాకం ఏర్పడ్డాక ఏలకులు, పనీర్‌ని పాకంలో వేసి గాలి చొరబడకుండా మూత పెట్టాలి. 20 నిమిషాల పాటు మీడియం మంటపై మరగనిచ్చి స్టౌ కట్టేయాలి. పదినిమిషాల తర్వాత మూత తీసి పనీర్ బాల్స్‌ని సర్వింగ్ ప్లేట్‌లోకి తీసి పక్కన పెట్టుకోవాల. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టి 2కప్పుల పాలు, క్రీమ్ వేసి 10నిమిషాల పాటు మరగనివ్వాలి. అందులో పంచదార, రోజ్ వాటర్ కూడా వేసి 2నిమిషాలు మరగనివ్వాలి. క్రీమ్‌లా ఏర్పడిన మలాయ్‌ని పనీర్ బాల్స్‌పై వేసి ఆరనివ్వాలి. పిస్తా, కుంకుమ పువ్వుతో గార్నిష్ చేసి గంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. తర్వాత మలాయ్ చమ్ చమ్‌ని సర్వింగ్ ప్లేట్‌లోకి తీసి రుచి చూడండి. ఈ స్వీట్ 2-3 రోజుల వరకు పాడవకుండా ఉంటుంది.

జొన్న లడ్డు



కావాల్సిన పదార్థాలు

మొక్కజొన్న గింజలు-1/2 కిలో
పంచదార- 1/2 కిలో
నెయ్యి-1/2 కప్పు
యాలకులు- 4
కిస్‌మిస్‌లు-4
జీడిపప్పులు-4

తయారుచేసే విధానం

బాగా ఎండిన మొక్కజొన్న గింజల్ని సన్నని మంటపై దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. చల్లారిన తర్వత మిక్సీలో వేసి పొడి చేయాలి. పలుకులు లేకుండా ఉండేందుకు జల్లెడతో జల్లించి పంచదార పొడిని ఈ పిండిలో కలపాలి. యాలకుల పొడి, నెయ్యి, కూడా వేసి బాగా కలిపి ఉండలు చేసి ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక పాన్‌పై కొద్దిగా నెయ్యివేసి జీడిపప్పును బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. జొన్న లడ్డూలని వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లతో అలంకరించి అతిథులకందించండి.



నేర్చుకుందాం

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదా! ఆర్టిస్ట్ అంకుల్ కంగారూ బొమ్మని ఎలా గీయాలో ఇక్కడిచ్చారు. జాగ్రత్తగా నేర్చుకోండే.

రంగులు అద్దండి

ఆకుతో బొమ్మ

మనింటి ముందు రాలి పడిపోతుండే పచ్చి ఆకులు, ఎండుటాకులతో లేడి బొమ్మ ఎలా చేయచ్చో ఇక్కడ ఇచ్చాం! మీరూ ప్రయత్నించండి.

పూరించండి

ఇక్కడ కొన్ని బొమ్మలు వాటి ఎదురుగా అంకెలతో కొన్ని బాక్సుల్ని ఇచ్చాం. మీరు చేయాల్సిందేంటంటే బొమ్మల ఆధారంగా వాటి పేర్లేంటో గుర్తించి వాటిపైనున్న నెంబర్ల బాక్సులో ఆ పేర్లను రాసేయండి.



అతికిద్దాం

చింటూకి ఈ మధ్య మతిమరుపు మరీ ఎక్కువైపోయింది. ఇక్కడ ఒక బొమ్మను కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. కింద ఉన్న బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.



కనిపెట్టండి

ఇక్కడ ఇచ్చిన ఆకులో మన ఇంట్లో వుండే కొన్ని వస్తువులతో పాటు మనం తినే పదార్థాలు దాగున్నాయి. కిందున్న బొమ్మల ఆధారంగా అవెక్కడున్నాయో కనుక్కోండి.



పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే చాలా ఇష్టం కదా. ఇప్పటికే మీ డ్రాయింగ్ పుస్తకాలు, గోడలపై ఎన్నో బొమ్మల్ని గీసే ఉంటారు. అయితే మీరు



తొమ్మిదేళ్ల యాబ్‌స్ట్రాక్ట్ పెయింటర్

యాబ్‌స్ట్రాక్ట్ పెయింటర్ షోర్య మహానత్ గురించి విన్నారా? రంగుల సాయంతో మన ఊహలకి ఊపిరి పోయడమే యాబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ అంటే. మహారాష్ట్రలోని నీమచ్ పట్టణానికి చెందిన షోర్య ప్రపంచంలోకెల్లా అతి పిన్న వయసున్న యాబ్‌స్ట్రాక్ట్ పెయింటర్. నాలుగేళ్ల వయసులో షోర్య గీసిన చిత్రాలు ముంబైలోని తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్లో ప్రదర్శనకి ఉంచగా అవి ఎంతో మందిని ఆకర్షించాయి. ప్రపంచ ప్రఖ్యాత పెయింటర్ జాక్సన్ పొలక్ స్టైల్‌కి అతి దగ్గరగా ఉంటాయి షోర్య పెయింటింగ్స్.

ఆలోచనలకి పదును పెట్టే యాబ్‌స్ట్రాక్ట్ పెంటింగ్‌లో తన అలోచనలతో పాటు అందమైన రంగుల్ని అద్దడంలో ఆరితేరాడు షోర్య. అమెరికాలోని న్యూయార్క్‌లో వార్డ్ నెస్సే గ్యాలరీలో నిర్వహించిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో షోర్య పెయింటింగ్స్ కొన్ని లక్షల రూపాయలకి కొనుగోలు కావడమే కాకుండా ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ పెయింటింగ్స్‌గా ఎంపికయ్యాయి. అప్పటి నుండి ఆసియా, ఇంగ్లాండ్, యూరప్‌లో నిర్వహించే ఆర్ట్ ఎగ్జిబిషన్లలో షోర్య తన పెయింటింగ్స్‌కి ఎన్నో బహుమతుల్ని గెలుచుకున్నాడు. ఏడేళ్ల వయసులో పోగో టివి 'ఎమేజింగ్ కిడ్' అవార్డుని గెలుచుకున్నాడు షోర్య. వివిధ దేశాల్లో నిర్వహించే ఆర్ట్ ఎగ్జిబిషన్‌ల నుండి ఎప్పటికప్పుడు కొత్త మెళకువలు నేర్చుకుంటుంటాడు. ప్రముఖ పెయింటర్ ఆర్.కె. లక్ష్మణ్ గీసిన పెయింటింగ్స్‌తో పాటు ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో తన పెయింటింగ్స్‌కి ఆదరణ లభించడం ఎంతో ఆనందాన్నిచ్చిందట. అమెరికా అట్లాంటా సిటీ లోని హాల్ట్‌మెన్ గ్యాలరీ (ప్రపంచ ఫైన్ ఆర్ట్ గ్యాలరీ)లో ఇటీవల తొమ్మిదేళ్ల షోర్య వేసిన పెయింటింగ్ 3 లక్షల రూపాయలకి అమ్ముడవడం పెయింటింగ్‌లో ఆరితేరిన వారిని కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. తన పెయింటింగ్స్‌తో వచ్చిన డబ్బుని అనాథ పిల్లలకి స్వచ్ఛందంగా అందజేస్తున్నాడు షోర్య.

పద వికాసం - 21

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2		■	3			■	4	
5		■	6		■	■	7		■
8		9		■	10			■	11
	■		■	12		■	■	13	■
■	14		15	■	■	16	17	■	18
19		■	20		21	■	22	23	
	■	24		■	25		■		■
■	26			■		■	27	■	28
29			■	30	■	31		32	
33		■	34	■	35				

ఆధారాలు

అడ్డం

1. విద్య, జ్ఞానం (3)
3. అత్యాచార నిరోధక కొత్త చట్టం (3)
4. గ్రామీణ ప్రాంత మహిళ, శిశు అభివృద్ధి సంస్థ (2)
5. కొట్టివేత, తీసివేత (2)
6. సందు, వాడకట్టు (2)
7. ట్రామాకేర్‌లో కేర్ ఉండడం లేదు (2)
8. వారసులు గందరగోళంగా ఉన్నారు (4)
10. ఔనోయ్ సరిగా లేదు (3)
11. ఎవరైనా ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఇక్కట్లే..మొదట్లో (1)
12. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (2)
13. పాలకులతో మరియాదగా మెలగాలి ఆరులో (1)
14. అలక ఆవైపు నుంచే (3)
16. అటు నుంచి అమ్మను పిలవండి (2)
19. సముద్ర తీరంలోని అడవులు (2)
20. చిరునామా (3)
22. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (3)
24. ఆనీతం చివరి వరకు లేదు (2)
25. పశువులు మేసేది (2)
26. మేయడమంటే నిశ్చయంగా తినడమే 1,7,10 (3)
29. సంపద, ఆస్తి, సిరి (3)
30. అప్పట్లో ఆమె డీసెన్సీ లేకుండా నిరంకుశంగా వ్యవహరించారు ఎనిమిదిలో (1)
31. నవ్వుముఖం (4)
33. వాకిలి, గుమ్మం (2)
34. అడ్డం 11,13,34,30 కలిపితే ఇందిరాగాంధీ 1975 జూన్‌లో విధించిన 'ఎమర్జెన్సీ' (1)
35. ఎయిర్ హోస్టెస్ (5)

నిలువు

1. తెలుగులో మొబైల్ ఫోన్ (4)
2. చెవి కమ్మలు (3)
3. ప్రతినిధి చివరి యాభై శాతం (2)
4. జిల్లా నీటి యాజమాన్య నిర్వహణ సంస్థ (2)
6. రవితేజ, కాజల్, తాప్సీ, రమేష్‌వర్మ కాంబినేషన్లో 2011లో వచ్చిన సినిమా (2)
7. టెలికం నియంత్రణ సంస్థ (2)
9. సోలో పాటల్లో గిన్నిస్ రికార్డు పొందిన గాయని (3)
10. రాసుకునే పుస్తకం (2)
14. చివర (2)
15. అన్యాయం, దుర్నీతి (4)
17. నితిన్, సమంత, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్లో 2016లో సినిమా (2)
18. ఆంగ్ల అక్షరమాలలో 18వది (2)
19. తొలికి వ్యతిరేకం (2)
21. విషయం (3)
23. వడ్లు (2)
24. విస్మయం (3)
26. రామేశ్వరం మొదట్లో లేదు (3)
27. 'పంగున' సరిచేస్తే గడ్డపార (3)
28. ముఖాముఖి ముందులేదు (3)
29. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (2)
31. ఆభరణం (2)
32. పూర్ణం లోపించిన మోసం (2)

		9	1	8			6	7
3		7		2	4	8		
	5		3			9		
			6				9	
	7	6				1	8	
	9				2			
		1			9		7	
		5	8	4		6		9
9	3			7	6	2		

గతవారం జవాబులు

సుడోకు

9	7	8	3	4	1	5	2	6
1	2	3	8	6	5	4	7	9
4	6	5	9	7	2	8	1	3
8	3	1	2	5	6	9	4	7
2	9	7	4	8	3	6	5	1
6	5	4	7	1	9	2	3	8
3	8	9	5	2	7	1	6	4
7	1	2	6	9	4	3	8	5
5	4	6	1	3	8	7	9	2

1 అం	2 డ	ము	■	3 దే	శం	■	4 యో	గా	■
5 త	ప్పు	■	6 సిం	హం	■	7 ఋ	ధ	■	8 ప్రా
ర్జా	■	9 న	గ	■	10 లే	డి	■	11 క	■
13 లం	13 ది	ప	■	14 ప	గ	■	15 బ	■	16 నా
■	17 ఏ	రు	వా	క	■	18 ప	■	19 బ	స్న
20 ఢ్డీ	■	స	■	■	21 న	స్న	■	22 వా	లు
■	23 మం	దా	24 ర	25 పు	ష్ప	■	26 మా	వో	■
27 న	ది	■	28 స	ప్త	ము	29 మ	■	■	30 బే
డు	■	31 లో	గు	కా	■	32 డి	33 బ	34 స	క
35 మ	ళ్లి	గు	ళ్లా	లు	■	36 తొ	ల	క	రి







కిచెన్ క్లిక్స్

ఇటలీలోని మొడోనాకు చెందిన 46 ఏళ్ల ఫ్రాన్సెస్కో మటూకీకి వంట గదే లోకం. అక్కడే ఎక్కువగా గడిపేయడం ఆయనకు ఇష్టం. ఆ ఇష్టం ఇప్పుడు తన ఫొటోగ్రఫీ హాబీతో మరింత ఇష్టంగా మారిపోయింది. ఎందుకంటే అది 'కిచెన్ సస్పెన్షన్' అనే ఫొటోగ్రఫీ ప్రాజెక్ట్‌కు జన్మస్థలమైంది. తన కిచెన్‌లో రకరకాల పాత్రలు, వస్తువులతో ఆయన టైమ్ ఫ్రీజ్ చిత్రాల్ని కెమెరాలో బంధించాడు. వాటిని కొంత ఎత్తు నుంచి జార విడుస్తూ కొన్ని ఫ్రేమ్‌ల్లో ఫ్రీజ్ చేశాడు. ఎంతో వినూత్నంగా ఉన్న ఆ చిత్రాలు ఫొటోగ్రఫీ అభిమానులకు తెగ నచ్చేస్తున్నాయి





చిట్టి ఇంటికి దారేది?

బుజ్జి తల్లులకు బుడ్డి ఇళ్లే వెండీ హౌజెస్ లేదా ప్లే హౌజెస్. గురుగులాట ఆడాలన్నా.. బొమ్మల కొలువు పెట్టాలన్నా.. అలక తీర్చుకోవాలన్నా వీటి తలుపుల్ని పిల్లలు తేలిగ్గా తీసేయొచ్చు. కేవలం పిల్లల కోసమే ప్రత్యేకంగా రూపొందించిన ఈ మరగుజ్జు ఇళ్లు వారి ఎత్తుకు తగ్గట్టు ఉంటాయి. లోపలి భాగాలు బుడ్డోళ్ల అవసరాలకు తగ్గట్టు అమరి ఉంటాయి. వంట గదులు, పడక గదులు, స్నానాల గదులు, తోట ఇలా మామూలు ఇంట్లో ఎన్ని వసతులుంటాయో.. అవన్నీ కూడా వీటిలో ఉంటాయి. చిన్నారుల కోసం అదనపు హంగులు కూడా తీర్చిదిద్దుతారు. పిల్లల కోసం ఇలా బుల్లి ఇళ్లను కట్టాలనే ఆలోచన తట్టేందుకు 'పీటర్ ప్యాన్' పుస్తకమే కారణం. జే.ఎం. బార్రీ రాసిన ఈ పిల్లల పుస్తకంలో వెండీ డార్లింగ్ అనే పాత్ర కోసం హీరో పీటర్ ప్యాన్ లాస్ట్ బాయ్స్‌తో కలసి చిట్టి ఇళ్లు కడతాడు. ఆ కథనే తర్వాత నాటకంగా తీసిన సమయంలో బార్రీనే 1904లో ఓ ప్రాప్ హౌజ్ రూపొందించాడు. అదే వెండీ హౌజ్‌గా పాపులర్ అయిపోయింది. అది తెగ నచ్చేయడంతో క్రమంగా పాశ్చాత్య దేశాల్లో పాప్ కల్చర్‌లో భాగమైంది. పాశ్చాత్యులకు ఇది మురిపెమైతే దక్షిణాఫ్రికాలోని తక్కువ ఆదాయం గల కుటుంబాలకు షెల్టర్. వీటిని పోలే ఇరుకైన మరగుజ్జు ఇళ్లను పెద్ద ఇళ్ల ఖాళీ జాగాలో తాత్కాలికంగా కట్టుకుని ఉండేవాళ్లు.



Check List

Book Number	KNSR02B127	**Date**	03/09/22
Front Cover	Yes	**Back Cover**	Yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	**Cutting By**	Mouni
Scanned By	Sameera	**Pages**	29